VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 143 విశాఖపట్నం, 12 మార్చి 2026 గురువారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00


భయమెరుగని సాహసంతో వ్యక్తి జీవించాలి. మత సిద్ధాంతాలతో వ్యక్తి మనసు పాడు చేసుకోకూడదు

- స్వామి వివేకానంద


అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250


## పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# కాంగ్రెస్ రీల్స్ కూడా చేస్తుందేమో: మోదీ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. ఆ దేశాల్లోని ప్రవాస భారతీయుల పరిస్థితి మరింత దిగజారేలా రెచ్చగొట్టే, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేరళ పర్యటనలో భాగంగా బుధవారం ఎర్నాకుళంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మనం ఆందోళన చెందడం సహజమే. అక్కడ లక్షలాది మంది మన భారతీయులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వమని మీరు గుర్తుంచుకోవాలి. మనపౌరులు విదేశాల్లో ⏭ తరువాయి 2లో..

## రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు

# మరింత తగ్గిస్తాం: చంద్రబాబు

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అధికారులు-ప్రజాప్రతినిధుల కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు. "గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చాం. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా అమలు చేయాలి" "ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తాం. గత పాలనలో ట్రూఅప్ పేరిట విద్యుత్



ఛార్జీల భారం వేస్తే.. మేం ట్రూడౌన్ చేశాం. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం" అని తెలిపారు.

# డ్వాక్రా ఉత్పత్తులను ప్రమోట్ చేయాలి

## కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** డ్వాక్రా ఉత్పత్తులను ప్రమోట్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు (జష్ట్ఝుఅనతీఝుఎఝుఎబ) కలెక్టర్లను ఆదేశించారు. వీటిని 'స్వయం' బ్రాండ్ పేరుతో ప్రమోట్ చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్లతో నిర్వహించిన భేటీలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్' అంశంపై ఆయన మాట్లాడారు. డ్వాక్రా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అమూల్ తరహాలో స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ చేయాలని తెలిపారు. "డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు స్వయం పేరిట బ్రాండింగ్.. లోగో ⏭ తరువాయి 2లో..

# లొంగిపోయిన 108 మంది మావోయిస్టులు



**రాయ్‌పూర్ :** 108మంది మావోయిస్టులు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ అధికారులు బుధవారం తెలిపారు. వారిపై రూ.3.95కోట్ల రివార్డు ఉందని అన్నారు. దంతెవాడ నుండి 30మంది, సుక్మా నుండి 18మంది, బస్తర్ నుండి 16మంది, నారాయణపూర్ నుండి నలుగురు మరియు కాంకెర్లో నుండి ముగ్గురు లొంగిపోయారని, వీరంతా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన వారని భద్రతాదళాలు తెలిపాయి. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమాండర్లు ఉన్నారని, ఒక్కొక్కరిపై ఎనిమిది లక్షల వరకు రివార్డు ఉందని పేర్కొన్నాయి. వారి ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించాయి.

# వెలగపూడిలో భారీ అగ్నిప్రమాదం

**వెలగపూడి (అమరావతి) , విశాఖ సమాచారమ్, మార్చి 11 :** రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న



ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగతో కమ్ముకుంది. పెద్ద ఎత్తున పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైపులు, ఇతర సామగ్రి ఉండటంతో మంటలు అదుపు చేయడం కొంత కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు .. అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే భారీగా నిల్వ ఉంచిన పైపులు కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయన్నదానిపై అధికారులు ⏭ తరువాయి 2లో..

## అమెరికా టెక్ కంపెనీలపై

# ఇరాన్ గురి



**అమెరికా :** అమెరికా మిత్ర దేశాల్లోని కీలక స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సైనిక చర్యల కోసం ఈ సంస్థల టెక్నాలజీని ఉపయోగిస్తున్నందున వీటిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ అనుబంధ వార్తా సంస్థ తస్నీం న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. "ఈ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం మౌలిక సదుపాయాలకు విస్తరిస్తున్న కొద్దీ.. ఇరాన్ లక్ష్యాల పరిధి కూడా పెరుగుతోంది" అని తాజా కథనం పేర్కొంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్‌విడియా, ఒరాకిల్, పాలంటీర్ వంటి టెక్ సంస్థలతోపాటు ఇజ్రాయెల్ నగరాలు, గల్ఫ్ దేశాల్లో క్లౌడ్ ఆధారిత సేవలు అందిస్తున్న కొన్ని కార్యాలయాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు సంబంధించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలనూ లక్ష్యంగా చేసుకుంటామని.. ఇందుకోసం శత్రువులు తమకు స్వేచ్ఛ కల్పించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రజలు ఉండవద్దని ఇరాన్ హెచ్చరించింది.

# 'చరిత్రలో ఇదే తొలిసారి': లోక్‌సభలో రాహుల్ ఆగ్రహం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో విడతలో రాజకీయ సెగలు మరింతగా రాజుకున్నాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సభలో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. బుధవారం ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించడంతో గందరగోళం నెలకొంది. చర్చ సందర్భంగా అధికార పక్ష సభ్యులు పదేపదే తన పేరును ప్రస్తావించడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ప్రతిపక్ష నేతను సభలో మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడం ఇదే తొలిసారి అని ఆయన మండిపడ్డారు.



తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ సభను పక్కదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సభాపతి ఓం బిర్లా అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తున్నారని విపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అవిశ్వాస తీర్మానంపై ఫిబ్రవరిలోనే సుమారు 118 మంది ఎంపీలు సంతకాలు చేయగా, దీనిపై చర్చకు 10 గంటల సమయాన్ని కేటాయించారు. తీర్మానం నెగ్గాలంటే విపక్షాలకు సాధారణ మెజారిటీ అవసరం. అయితే, స్పీకర్ ఎన్నడూ పక్షపాతంగా వ్యవహరించలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విపక్షంలోని 50 మందికి పైగా ఎంపీలు వ్యక్తిగతంగా తనను కలిసి, ఈ తీర్మానంతో తాము ఏకీభవించడం లేదని, కేవలం ⏭ తరువాయి 2లో..

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు: ఎంపీ కలిశెట్టి



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** ఆర్థిక వ్యవస్థ గురించి జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. జగన్ హయాంలో మున్సిపల్ ఆఫీసులను కూడా తాకట్టు ⏭ తరువాయి 2లో..

## యుద్ధం వేళ భారీ ట్విస్ట్

# ఇరాన్‌కు ఉత్తర కొరియా మద్దతు

**ప్యాంగ్‌యాంగ్:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎన్నికపై తాజాగా ఉత్తర కొరియా స్పందించింది. కొత్త సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ ఎన్నికను ఉత్తర కొరియా స్వాగతించింది. అదే సమయంలో పశ్చిమాసియా దేశంపై చట్టవిరుద్ధమైన దాడులకు ఇజ్రాయెల్, బద్ధ శత్రువు అమెరికాను విమర్శించింది.

ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాజాగా ఓ ప్రకటనలో.. ఇరానియన్లు తమ నాయకుడిని ఎన్నుకునే హక్కును ఉత్తర కొరియా గౌరవిస్తుందని పేర్కొంది. అలాగే, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చట్ట విరుద్ధం. ఇరాన్‌పై వారి సైనిక చర్యలు, ఆ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరైంది కాదు. ఇరాన్ సామాజిక వ్యవస్థను పడగొట్టే ప్రయత్నం చేయడమేంటి?. ఇవి ప్రపంచవ్యాప్తంగా శాంతిని నాశనం




చేయడంతో పాటుగా అస్థిరతను పెంచుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఇరాన్ సుప్రీం లీడర్ ⏭ తరువాయి 2లో..

# ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఎంపికలో బిగ్ ట్విస్ట్!

**టెహ్రాన్:** ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా అయతుల్లా సయ్యద్ మొజ్తాబా ఖమేనీ ఎంపిక విషయంలో బిగ్‌ట్విస్ట్ చోటు చేసుకుంది. తన కుమారుడు తన వారసుడిగా కొనసాగడం తనకు ఇష్టం లేదని అయతుల్లా అలీ ఖమేనీ వీలునామా రాసినట్లు తెలుస్తోంది.

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన అయతుల్లా అలీ ఖమేనీ స్థానంలో మొజ్తాబాను ఇరాన్ నిపుణుల అసెంబ్లీ ఎన్నుకుంది. అయితే ఈ మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలువురు పెదవి విరిస్తున్నారు. తాజాగా, ట్రంప్ మాత్రమే కాదు మొజ్తాబా తండ్రి, మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి సైతం ఇష్టం లేదని ఆధారాలు వెలుగులోకి వచ్చాయి.

తన కుమారుడు మొజ్తాబా ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు అర్హతలు లేవని, గతంలో పలు మార్లు చెప్పిన




ఆయతుల్లా వ్యాఖ్యల్ని ఉటంకిస్తూ తాజాగా, పలు అంతర్జాతీయ మీడియా కథనాలు ⏭ తరువాయి 2లో..

# టిప్పర్ డ్రైవర్‌తో వివాహేతర సంబంధం..!

**కర్ణాటక:** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను హత్య చేయించిందో భార్య. ఆమెతో పాటు నలుగురు నిందితులను శ్రీరంగపట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. తాలూకాలోని మారళగాల గ్రామ అర్చకుడు సిద్ధలింగప్ప తన అక్క కుమార్తె షాలినిని వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. షాలినికి అదే ఊరికి చెందిన టిప్పర్ డ్రైవర్ హరీశ్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఒకరోజు షాలిని, హరీశ్ ఏకాంతంగా ఉన్నప్పుడు భర్తకు దొరికిపోయారు. ఇలాంటి పనులు చేయరాదని భార్యను మందలించడంతో ఆమె కక్ష పెంచుకుంది. తన భర్తను చంపేయమని హరీశ్‌కు సిఫార్సు చేసింది.

మార్చి 6న రాత్రి అర్చకుడు సిద్ధలింగప్ప.. కె.శెట్టిహళ్లి గణపతి దేవస్థానంలో పూజ ముగించుకుని ఇంటికి పయనమయ్యాడు. హరీశ్, మరో టిప్పర్ డ్రైవర్ సంతోష్ కుమార్‌తో కలసి గ్రామం వద్ద ఉన్న కాలువ ఏరియా నిర్మానుష్య ప్రాంతంలో అర్చకుడిని అడ్డగించారు. కట్టెలతో బాది చంపేశారు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు అక్కడక్కడ అతని వస్తువులు వేసి, బైక్‌ను కాలువలోకి పడేశారు. 7న సీడీఎస్ కాలువలో సిద్ధలింగప్ప మృతదేహం లభించింది. ముఖానికి, తలకు గాయాలున్నాయి. ఎవరో వ్యక్తులు దాడి చేసి చంపి ఉంటారని భావించి అతడి అన్న బాలసుందర్ శ్రీరంగపట్టణ గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ శోభారాణి ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆధారాలను బట్టి మార్చి 9న హరీశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. సిద్ధలింగప్ప భార్య షాలిని, సంతోష్ కుమార్, గణేశ్‌తో కలిసి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా అంత్యక్రియల్లో కూడా పాల్గొన్నట్లు అంగీకరించాడు. షాలిని, హరీశ్, సంతోష్ కుమార్, గణేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఊరి దారి కోసం.. సర్కారుకు సర్పంచ్ బంపర్ ఆఫర్



**శ్రీకాకుళం జిల్లా, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** ఓ సర్పంచ్ ఏకంగా సర్కారుకే ఆఫరిచ్చారు. ఎంత వేచి చూసినా గ్రామానికి రోడ్డు పడకపోవడం, ఉన్న దారులను బాగు చేయకపోవడంతో రోడ్డు వేస్తే తాను ఏం చేస్తానో చెబుతూ ప్రభుత్వానికి ఓ బంపర్ ఆఫర్ ప్రకటించారు. కొత్తూరు మండలంలోని గురండి సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు ఈ ప్రకటన చేశారు. గురండి గ్రామానికి వచ్చే నాలుగు రహదారులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు, నాయకులు స్పందించలేదు. దీంతో స్థానిక సర్పంచ్ ఓ ప్రకటన చేశారు. గురండి గ్రామానికి వచ్చే నాలుగు రహదారులను ప్రభుత్వం మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే.. ఆ కాంట్రాక్టర్‌కు రూ.3 లక్షలు సాయం చేయడంతో పాటు రోడ్డు పనులు పూర్తయ్యే వరకు వాటర్ ట్యాంకుతో నీరు సరఫరా చేస్తానని ప్రకటించారు. ఏప్రిల్ రెండోతో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తవుతున్నందున ఏప్రిల్ రెండో తేదీ లోపు పనులు ప్రారంభిస్తేనే ఈ సాయం అందజేస్తానని తెలిపారు. దీనిపై సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లోనూ విన్నవించారు.

# లిఫ్ట్ అడిగిన మహిళపై సామూహిక అత్యాచారం



**మహబూబ్ నగర్ జిల్లా, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** మోటార్‌బైక్‌పై లిఫ్ట్ అడిగిన మహిళపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన ఘటన జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. బాదేపల్లి శివారులోని ఓ కాలనీకి చెందిన వివాహిత మహిళ(35) పట్టణంలో పనులు ముగించుకుని తన ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో తనకు తెలిసిన ఓ వ్యక్తి మరో వ్యక్తితో కలిసి మోటార్‌బైక్‌పై వెళ్తుండగా ఆమె గమనించి లిఫ్ట్ అడిగింది.

దీంతో మోటార్ బైక్‌పై ఉన్న ఇద్దరూ ఆమెను ఎక్కించుకుని వెళ్లారు. అయితే మార్గమధ్యలో ఉన్న నిర్జన ప్రదేశానికి వెళ్లిన వెంటనే చీకట్లోకి బైక్‌ను మళ్లించి ఆమెను భయభ్రాంతులకు గురిచేసి ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బాధిత మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళ చెప్పిన సమాచారం ఆధారంగా పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# మచిలీపట్నం పోలీసులకు ఎదురుదెబ్బ

**విజయవాడ, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** మచిలీపట్నం పోలీసులకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇదే సమయంలో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధకు ఏపీ హైకోర్టులో ఉపశమనం దక్కింది. కోర్టు షరతులను జయసుధ ఉల్లంఘించలేదని పోలీసులకు హైకోర్టు గుర్తు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధ బెయిల్ రద్దు చేయాలని మచిలీపట్నం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కోర్టు షరతులు ఉల్లంఘించారంటూ పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం, ఏపీ కోర్టు.. పోలీసుల పిటిషన్‌ను తోసిపుచ్చింది. కోర్టు షరతులను జయసుధ ఉల్లంఘించలేదని గుర్తు చేసింది. ఈ క్రమంలో జయసుధ ముందస్తు బెయిల్‌ను రద్దు చేసేందుకు హైకోర్టు అంగీకరించలేదు. అయితే,




రేషన్ బియ్యం అక్రమ కేసులో జయసుధకు ఇప్పటికే మచిలీపట్నం కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

# 'ఎన్‌సీఈఆర్‌టీ' వివాదంలో మరో మలుపు




**న్యూఢిల్లీ:** నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్యపుస్తకాల చుట్టూ ముసురుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. అన్ని తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలను సమగ్రంగా సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఈఆర్‌టీని ఆదేశించింది. ఈ విషయాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బుధవారం సుప్రీంకోర్టుకు విన్నవించారు. న్యాయవ్యవస్థపై ఎనిమిదో తరగతి పుస్తకంలో వివాదాస్పద అంశాలు చోటుచేసుకోవడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

పాఠ్యప్రణాళికను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఆయా రంగాలకు చెందిన నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని సొలిసిటర్ జనరల్ ధర్మాసనానికి హామీ ఇచ్చారు. అయితే ఈ సమీక్ష బాధ్యతను కేవలం ఎన్‌సీఈఆర్‌టీకి మాత్రమే వదలకుండా, కేంద్రమే స్వయంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. విద్యా ప్రమాణాలను కాపాడటంలో నిష్పాక్షికత అవసరమని కోర్టు పేర్కొంది.

ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్రం పాఠ్యపుస్తకం 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్'లో న్యాయవ్యవస్థపై ఉన్న నాలుగో అధ్యాయం తీవ్ర వివాదానికి దారితీసింది. దీనిపై ఎన్‌సీఈఆర్‌టీ బేషరతుగా క్షమాపణలు చెప్పింది. 'న్యాయవ్యవస్థ పాత్ర' అనే అధ్యాయంలో అభ్యంతరకర అంశాలు ఉన్నట్లు అంగీకరిస్తూ, సదరు పుస్తకాన్ని పూర్తిగా ఉపసంహరించుకున్నట్లు ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రకటించారు. విద్యా విషయాల్లో ఖచ్చితత్వం, బాధ్యతను పాటించడంలో తాము కట్టుబడి ఉన్నామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

# ఉద్యోగ ఆరాటం.. నగరంలో పోరాటం

**గ్రామాల నుంచి నగరానికి వస్తున్న యువత**
**ఉద్యోగ సాధనకు అహర్నిశలు శ్రమిస్తున్న నిరుద్యోగులు**
**పార్కులు, గ్రంథాలయాలే చదువుల వేదికలు**
**ఇరుకు గదుల్లో పుస్తకాలతో కుస్తీ**
**వివిధ సంస్థల్లో శిక్షణ**

**విజయనగరం గంటస్తంభం, విశాఖ సమాచారమ్, మార్చి 11 :** విద్యకు నిలయంగా పేరొందిన విజయనగరం నిరుద్యోగ యువత కొలువుల సాధనకు ఆశల కేంద్రంగా మారింది. కొలువుల సాధనే లక్ష్యంగా పల్లెల నుంచి నిరుద్యోగ యువత నగరబాట పడుతున్నారు. చిన్నచిన్న అద్దెగదుల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

కొలువుల సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే అయినా.. మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలనే పట్టుదలతో రోజంతా పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. పార్కులు, చెట్ల కింద, మైదానాలు, గ్రంథాలయాలను చదువు వేదికలుగా మలచుకుంటూ... కలిసికట్టుగా కొలువుల సాధనకు కష్టపడుతున్నారు.

**చిన్నగదుల్లో పెద్దపెద్ద కలలు..**

విజయనగరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు చిన్నచిన్న గదులను అద్దెకు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఇద్దరు, మరికొన్ని చోట్ల ముగ్గురు లేదా నలుగురు కలిసి ఒకే గదిలో ఉంటూ చదువుకుంటున్నారు. చదవడానికి సరైన వాతావరణం లేకపోయినా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. చిన్నగదుల్లోనే పెద్ద లక్ష్యాలతో చదువుతున్న యువత కష్టాలు.. వారి జీవిత పోరాటాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా..**

నగరానికి వచ్చే యువతలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలిపనులు చేస్తూ కష్టపడి సంపాదించిన డబ్బులో కొంత భాగం పిల్లలకు పంపిస్తున్నారు. నగరంలో జీవనం సులభం కాదు. అద్దె గదులు, పుస్తకాలు, అప్లికేషన్ ఫీజులు, కోచింగ్ ఖర్చులు.. ఇవన్నీ కలిపి వారికి పెద్ద భారంగా మారుతున్నాయి. ఒక పరీక్షకు అప్లై చేయాలంటే రూ.200 నుంచి రూ.500 వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ఉద్యోగ సాధన కోసం ఆర్థిక కష్టా లు భరిస్తూనే పుస్తకాలతో నేస్తం చేస్తున్నారు.

పలు శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతికింద ప్రతినెలా రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కనీసం ఆ డబ్బులు ఇచ్చినా ఉద్యోగ సాధన శిక్షణకు ఉపయోగపడేవని, పరీక్ష ఫీజులు చెల్లించేందుకు ఆర్థిక



ఇబ్బందులు ఉండేవికాదని కొందరు యువకులు అభిప్రాయపడుతున్నారు. నిరుద్యోగులను మోసం చేయడం చంద్రబాబుకు తగదని చెబుతున్నారు.

**ఉద్యోగం కోసం ఊరిని వదిలి..**

మా గ్రామంలో చదువు అవకాశాలు తక్కువ. అందుకే విజయనగరానికి వచ్చి అద్దె గదిలో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే. అయినా ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు అండగా నిలవాలనేది నా లక్ష్యం. ప్రస్తుతం రైల్వే ఉద్యోగానికి చదువుతున్నాను. ప్రభుత్వం నిరుద్యోగభృతి ఇస్తే మాలాంటి పేద కుంటుంబాల విద్యార్థులకు ఉపయోగపడేది.

**- ముత్యాల తరుణ్, నిరుద్యోగి, తాటిపూడి గ్రామం**

**గ్రంథాలయాలు, పార్కులే చదువు కేంద్రాలు**

రోజంతా గదుల్లో చదవడం కష్టంగా ఉండడంతో చాలా మంది విద్యార్థులు గ్రంథాలయాలను ఆశ్రయిస్తున్నారు. విజయనగరం పట్టణంలోని గురజాడ గ్రంథాలయం యువతకు ప్రధాన చదువు కేంద్రంగా మారింది. ఇంకొందరు ప్రశాంత వాతావరణం కోసం పెద్దచెరువు, మయూరి పార్క్ వంటి ప్రదేశాలకు వెళ్లి చెట్లనీడలో కూర్చుని చదువుతున్నారు. గ్రూప్ డిస్కషన్స్‌తో ముందుకు సాగుతున్నారు. గ్రూప్స్, రైల్వే, బ్యాంక్, ఎస్ఎస్‌సీ వంటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారు.

**ఉద్యోగ సాధనే ప్రధానం**

గ్రామం నుంచి నగరానికి వచ్చి చిన్న గదిలో ఉంటూ చదువుకుంటున్నాం. అద్దె, పుస్తకాలు, అప్లికేషన్ ఫీజులన్నీ భారంగా ఉన్నా ఉద్యోగం సాధించాలనే ఆశతో కష్టపడుతున్నాం. మా కష్టం ఫలిస్తుందనే నమ్మకం ఉంది.

**- కె.గంగయ్య, నిరుద్యోగి, కోటబొమ్మాళి గ్రామం**

**లక్ష్యంతో చదువుతున్నా..**

కొన్నాళ్లుగా విజయనగరం జిల్లా కేంద్రంలోనే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ప్రతిరోజు గ్రంథాలయంలో ఎక్కు వ సమయం చదువుకుంటున్నాను. ఆర్ఆర్‌బీ పరీక్షకు సిద్ధమవుతున్నాను. పోటీ ఎక్కువగా ఉన్నా పట్టుదలతో ముందుకు సాగుతున్నాను.

**- భవానీశంకర్, నిరుద్యోగి, విజయనగరం కంటోన్మెంట్**

# కాంగ్రెస్ రీల్స్ కూడా చేస్తుందేమో: మోదీ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

చిక్కుకున్నప్పుడల్లా వారి క్షేమం కోసం వనరులన్నీ ఉపయోగిస్తుంటాం. ఎప్పుడూ మన పౌరుల్ని ఒంటరిగా వదిలేయలేదు. ప్రస్తుత సంక్షోభంలో కూడా అవసరమైన సహాయం అందేలా చూస్తున్నాం. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి మనపౌరులకు 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయి. పశ్చిమాసియాలోని మన మిత్రదేశాలు భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నాయి. ఈ సంక్షోభ సమయంలో కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడం దురదృష్టకరం. ఆందోళనలు రేకెత్తించేలా హస్తంపార్టీ ఉద్దేశపూర్వకంగానే ప్రకటనలు చేస్తోంది. ఈ ప్రచారం కోసం వారు రీల్స్ కూడా చేస్తారేమో" అని కాంగ్రెస్ (జశీఅస్త్రతీవం)పై ధ్వజమెత్తారు.

ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు, మేకిన్ ఇండియాను బలోపేతం చేసేందుకు పెట్రోలియం రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకమని మోదీ (ఙవీ వీశీఱ) అన్నారు. ఆ లక్ష్యంతోనే కొచ్చి రిఫైనరీ వద్ద పాలీప్రొపిలీన్ యూనిట్‌కు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ఈ గల్ఫ్ వార్ స్వావలంబన ఆవశ్యకతను మరోసారి నొక్కి చెప్పిందన్నారు.

# వెలగపూడిలో భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

విచారణ ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాల వల్లా అగ్నిప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే మోహరించి చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో వెలగపూడి ప్రాంతంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

# యుద్ధం వేళ భారీ ట్విస్ట్ ఇరాన్‌కు ఉత్తర కొరియా మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

మోజ్తాబా ఖమేనీ భద్రతపై ఆందోళన పెరుగుతోంది. దీనిపై చైనా (ఎష్ట్రఱఅఖ) తాజాగా స్పందించింది. మోజ్తాబా ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరాన్‌లో హత్యకు గురైన తండ్రి అలీ ఖమేనీ వారసుడికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సైన్యం బెదిరింపుల నేపథ్యంలో ఆయనను లక్ష్యంగా చేసుకోవడంపై తాము వ్యతిరేకిస్తున్నట్లు చైనా తెలిపింది. మోజ్తాబా ఖమేనీని నియమించాలనే ఇరాన్ నిర్ణయాన్ని వారి అంతర్గత విషయంగా చైనా పేర్కొంది.ఏ సాకుతోనైనా ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని చైనా వ్యతిరేకిస్తుందని తెలిపింది. ఇరాన్ సార్వభౌమాధికారం, భద్రత , ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ ఇజ్రాయెల్ కు హితవు పలికారు. ఇరాన్ రాజ్యాంగ ప్రక్రియ ద్వారా మోజ్తాబా పేరును ఖరారు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను చైనా గతంలో చట్టవిరుద్ధమైన దురాక్రమణగా ఖండించింది. కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది.

# ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఎంపికలో బిగ్ ట్విస్ట్!

(మొదటి పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చాయి. ఆ కథనాల్లో తన వారసుడిగా మొజ్తాబా అనర్హుడంటూ గతంలో చెప్పిన విషయాన్ని తాజాగా న్యూయార్క్ టైమ్స్ కథనంలో పేర్కొంది. అయినప్పటికీ, వడ్డించే వాడు మనవాడయితే.. బంతి చివర్లో కూర్చున్నా కంచంలో అన్నీ వచ్చి చేరతాయని సామెత చందంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఒత్తిడి మేరకు మొజ్తాబా ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నుకోవడం అనివార్యమైంది. ఇరాన్‌లోని ప్రస్తుత ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య మార్పు కోసం కృషి చేస్తున్న నేషనల్ యూనియల్ ఫర్ డెమోక్రసీ ఇన్ ఇరాన్ (ఎన్‌యూడీఐ) రీసెర్చ్ డైరెక్టర్ ఖోస్రో ఇస్ఫహానీ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఖోస్రో మాట్లాడుతూ.. మొజ్తాబాకు ఇరాన్‌ను నడిపించే శక్తి సామర్థ్యాలు, అనుభవం, రాజకీయ అనుభవం లేదు. మొజ్తబా రాజకీయంగా ప్రభావం చూపలేకపోయాడు. చెప్పుకోదగ్గ విజయాలు సాధించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.

ఇరాన్ నాయకత్వ వారసత్వాన్ని సాధారణంగా సుప్రీం నాయకుడిని ఎన్నుకునే బాధ్యత షియా మత పెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్)కి ఉంది. మొజ్తాబా నియామకం అసెంబ్లీ ఎక్స్‌పర్ట్స్ కమిటీ నిబంధనలకు అనుగుణంగా ఎన్నిక జరగలేదు. బదులుగా, గత వారం ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎవరు అనే అంశంపై చర్చలు జరిగాయి. అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో ఐఆర్‌జీసీ తరుపు ప్రతినిధులు సైతం హాజరయ్యారు. వారే కమిటీ సభ్యులపై ఒత్తిడి తెచ్చి మొజ్తాబాను ఎన్నుకునేలా చేశారని చెప్పారు.

ఇరాన్ ఇంటెలిజెన్స్ వర్గాలతో మాకు మంచి సంబంధాలున్నాయి. ఖమేనీ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సిన నిపుణుల సభ మొజ్తాబాకు ఓటు వేయలేదు. అతనిపై చాలా వ్యతిరేకత ఉంది. కానీ ఐఆర్‌జీసీ ఒత్తిడితో, అతన్ని వారసుడిగా పేర్కొన్నారు. సుప్రీం లీడర్ అంటే తాము చెప్పినట్లు నడుచుకునే నాయకుడే కావాలని ఐఆర్‌జీసీ చూస్తోంది. అందుకే మొజ్తాబాను ఎంచుకుంది. ఐఆర్‌జీసీ ఏది చెబితే అది చేసే మనస్తత్వం మొజ్తాబాది. ఐఆర్‌జీసీ ఆయన్ని ఓ తోలు బొమ్మలా చూస్తోందని' ఆరోపించారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు: ఎంపీ కలిశెట్టి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని పాలసీతో రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. "కేంద్రానికి లేఖ రాస్తానని జగన్ చెబుతున్నారు. ఆయన చిట్టా మొత్తం కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది. భవిష్యత్తు తరాలకు సంపద కావాలంటే చంద్రబాబు అవసరమని పవన్ చెప్పారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు పట్టుకుంది. ఐదేళ్లలో ప్రజలకు ఏమీ లేకుండా చేసిన జగన్.. ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. నకిలీ మద్యంతో జగన్ మహిళల తాళిబొట్లు తెంపారు. ఆయన ప్రెస్ మీట్ పెట్టుకోవచ్చు కానీ.. ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు. తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ పథకాలతో మహిళలకు కూటమి ప్రభుత్వం అగ్రస్థానం కల్పించింది. ఒకటో తేదీన జీతాలు, పింఛన్లు ఇస్తున్నాం. ఎన్డీయే కూటమిపై ఆరోపణలు చేయడం జగన్ మానుకోవాలి" అని కలిశెట్టి అన్నారు.

# 'చరిత్రలో ఇదే తొలిసారి' లోక్‌సభలో రాహుల్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఒత్తిడి మేరకే సంతకాలు చేశామని చెప్పారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

**వంట గ్యాస్ కొరతపై..**

దేశంలో వంట గ్యాస్ (ఎల్పీజీ) కొరతను నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో విపక్ష నేతలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల సరఫరా వ్యవస్థ దెబ్బతిని, గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా సామాన్యులకు సిలిండర్లు దొరకని పరిస్థితి ఏర్పడిందని సిపిఐ ఎంపీ సంతోష్ కుమార్ రాజ్యసభలో వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. 2019 నుంచి లోక్‌సభలో 'డిప్యూటీ స్పీకర్' పదవి ఖాళీగా ఉండటం రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఆరోపించింది. గతంలో స్పీకర్‌పై తీర్మానం ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్ సభను నడిపించేవారని, కానీ ప్రస్తుతం ఆ వ్యవస్థే లేకుండా పోయిందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాగా ఇరాన్ తదితర గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతల కారణంగా చిక్కుకుపోయిన వెయ్యి మందికి పైగా భారతీయ మత్స్యకారులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని కన్యాకుమారి ఎంపీ విజయ్ వసంత్ డిమాండ్ చేశారు.

# డ్వాక్రా ఉత్పత్తులను ప్రమోట్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశాం. మల్టీ బిలియన్ డాలర్ల కంపెనీ తరహాలో బ్రాండింగ్‌కు కృషి చేయాలి. అమూల్ తరహాలోనే సహకార విధానంలో మార్కెటింగ్ జరగాలి. డ్వాక్రా మహిళలు రుణాలను తప్పకుండా తిరిగి చెల్లిస్తారు. వారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయి" అని తెలిపారు.

# సిలిండర్ల పంపిణీకి కొత్త నిబంధనలు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** కలెక్టరేట్, ఎలమంచిలి, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో వంటింట్లో గ్యాస్‌కు మంటలు అంటుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయి. గృహ వినియోగ గ్యాస్ బండ ధర రూ. 60, వాణిజ్య సిలిండర్ ధర రూ. 115 వరకు పెరిగింది. జిల్లాలో మొన్నటి వరకు రూ. 894.50గా ఉన్న వంటగ్యాస్ బండ ధర ప్రస్తుతం రూ. 954.50కు చేరుకుంది. వాణిజ్య సిలిండర్ ధర రూ. 1929 నుంచి రూ. 2044 ధరకు ఎగబాకింది. ఇంటికి చేరేసరికి తీసుకునే కమీషన్లతో ఇంకాస్త పెరుగుతుంది. వినియోగదారులకు ఇది అదనపు భారంగా మారింది. ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లపై భారం వాణిజ్య సిలిండర్‌కు రూ.115 ధర పెంచేయడంతోపాటు రెస్టారెంట్లు, హోటళ్ల వ్యాపారులకు కష్టాలు మొదలయ్యాయి. దీనికితోడు గృహ వినియోగ సిలెండర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇంధన సంస్థలకు కేంద్రం సూచించింది. దీంతో గతంలో ఇట్టే దొరికే వాణిజ్య సిలిండర్ నేడు లభించడం కష్టంగా మారింది. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది గతంలో వాణిజ్య అవసరాకూ గృహావసర బండలు ఇచ్చి అదనంగా కొంత తీసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. గ్యాస్ సిలిండర్ రావడమే కష్టంగా మారుతోంది. ఇప్పటికే బెంగళూరులో గ్యాస్ సరఫరాలో జాప్యం కారణంగా హోటళ్లు బంద్ చేస్తున్నట్లు అక్కడి హోటళ్ల అసోసియేషన్ ప్రకటించింది. జిల్లాలో అంత తీవ్రమైన పరిస్థితులు లేకపోయినా హోటళ్ల యజమానులు కొరత ఎదుర్కొంటున్నారు. గ్యాస్ సరఫరాలో కఠిన నిబంధనలు పాటించాలని కేంద్రం ఆదేశాలతో ఆయిల్ కంపెనీలు ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేశాయి. సింగిల్ సిలిండర్ కనెక్షన్‌కు 25 రోజుల తరవాత, డబుల్ కనెక్షన్ ఉన్న వినియోగదారులకు 30 రోజుల తరవాత పంపిణీ చేయాలని నిబంధనలు విధించారు.

సిలిండర్ల పంపిణీ సమయంలో ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే 1976 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి పేర్కొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో గృహావసరాల బండలు వినియోగిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం ఎక్కడా కొరత లేదన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
టెండరు ప్రకటన నెం.
WAT-TRD-61-25-26, తేదీ. 05.03.2026
పని పేరు మరియు ప్రదేశం: వాల్తేరు డివిజన్ నందలి వేర్వేరు TSSలోని ట్రాక్షన్ ట్రాన్స్ ఫార్మర్లు యొక్క పెంపుదల పని.
టెండరు విలువ: ₹ 1,40,33,294.56, బయానా: ₹ 2,20,200/-, పని పూర్తి చేయు కాలం: 11 నెలలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 31.03.2026న 1500 గంటలకు.
పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in
డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRD) వాల్తేరు
PR-1206/Q/25-26

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
(1) ప్రకటన నెం. eT-WAT-South-07-2026, తేదీ. 03.03.2026
పని పేరు: అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/ట్రాక్/వాల్తేరు వారి పరిధిలో మెయిన్ లైనుపైన పెందుర్తి -సింహాచలం నార్తు మధ్యన శ్రమశక్తి నగర్ ప్రజలకు శ్మశానవాటికకు వెళ్ళేందుకు దారి కల్పించుటకు కి.మీ. 862/29A-31A వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి కొరకు 2.5x2.5 RCC బాక్సు ఏర్పాటు చేయుట.
సుమారు పని విలువ: ₹ 1,72,55,824.03, బయానా: ₹ 2,36,300/-, పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.
(2) ప్రకటన నెం. eT-WAT-South-08-2026, తేదీ. 03.03.2026
పని పేరు: సీనియర్ డివిజనల్ ఇంజనీరు/సౌత్/వాల్తేరు వారి పరిధిలో ఏజన్సీ ద్వారా (RDSO గుర్తింపు పొందిన సంస్థ మాత్రమే) కర్వ్స్ నందు 65 ట్రాక్ మౌంటెడ్ ఆటోమ్యాటిక్ గేజ్ ఫేస్ లూబ్రికేటర్స్ (ఎలక్ట్రానిక్ టైపు) సప్లయి, ఇనస్టలేషన్, కమీషనింగ్ మరియు మెయింటెనెన్స్ 5 సంవత్సరాల కాలం నిర్వర్తించుట.
సుమారు పని విలువ: ₹ 8,42,70,240.60, బయానా: ₹5,71,400/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 11,800/-, పని పూర్తి చేయు కాలం: 60 (అరవై) నెలలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 26.03.2026న 1500 గంటలు (వ.నెం. 1 కొరకు) & 27.03.2026న 1500 గంటలు (వ.నెం. 2 కొరకు).
ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి. పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.
సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు
PR-1207/Q/25-26

## ఆవేదన నిండిన మనసులకు..

## ఆర్థిక సాంత్వన

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నగర రహదారులపై గుర్తు తెలియని వాహనాలు ఢీ కొంటున్న (హిట్ అండ్ రన్) కేసులు తరచూ నమోదవుతున్నాయి. సంబంధిత వాహనాన్ని గుర్తించకపోతే బాధితులకు థర్డ్‌పార్టీ బీమా పరిహారం అందే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో అలాంటి బాధితులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. 2022 ఏప్రిల్ 1 నుంచి హిట్ అండ్ రన్ కేసుల్లో మృతులకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే పథకం గురించి అవగాహన లేకపోవడం, తెలిసినా దరఖాస్తు చేయడానికి అవసరమైన ధ్రువపత్రాలు అందక బాధితులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా విశాఖ పోలీసులు ఒక చక్కటి ఆలోచన చేశారు. బాధితులకు ప్రత్యేక సహాయ కేంద్రం: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రాన్ని పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేశారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి పరిహారం అందని బాధితులను ఇక్కడ గుర్తిస్తారు. వారికి ఫోన్ చేసి కేంద్ర ప్రభుత్వ పథకం గురించి అవగాహన కల్పిస్తారు. మృతి చెందితే పోస్టుమార్టం రిపోర్టు, తీవ్రగాయాలైతే క్షతగాత్రులకు ధ్రువీకరణ పత్రం, ఎంవీఐ నివేదికలు వచ్చేలా అక్కడి సిబ్బంది బాధ్యత తీసుకుంటారు. అన్ని ధ్రువపత్రాలను సేకరించాక బాధితులతో దరఖాస్తు చేయిస్తారు. చేసి జీఐ (జనరల్ ఇన్సూరెన్స్) కౌన్సిల్ ముంబయికి పంపిస్తారు. 15 రోజుల్లో బాధితులకు పరిహారం జమయ్యేలా చూస్తున్నారు.

# ప్రజల ప్రాణాలతో జీవీఎంసీ చెలగాటం

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** తాగునీటి సరఫరా విషయంలో జీవీఎంసీ అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మురుగునీటి కాలువ లోపల నుంచి తాగునీటి పైప్‌లైన్లు వేస్తున్నారు. ఆ పైప్‌లైన్‌కు ఏమాత్రం లీకేజీ ఏర్పడినా మురుగునీరు కలిసి లక్షలాది మంది అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. అయినప్పటికీ అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు.



ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది, బొట్టవానిపాలెం, సాయిరాం కాలనీ, తిమ్మాపురం, రుషికొండ, ఐటీ హిల్స్, సాయిరాం కాలనీ వంటి ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. ఇందుకోసం జీవీఎంసీ అధికారులు రిజర్వాయర్ నుంచి జాతీయ రహదారిని ఆనుకుని కొమ్మాది వరకు పైప్‌లైన్ నిర్మించారు. ఈ పైప్‌లైన్ మురుగనీటి కాల్వలో ఉంది. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో రోడ్డుకు ఒకవైపున రెండు డెక్టులు ఉండేలా డ్రైనేజీ నిర్మించారు. రోడ్డును ఆనుకుని ఉండే డెక్టులో జాతీయ రహదారిపై పడే వర్షం నీరు, దానికి ఆనుకుని ఉన్న మరొక డెక్టులో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. అయితే మురుగునీరు ప్రవహించే డెక్టు లోపల నుంచి ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్‌ను వేశారు. ప్రస్తుతం పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది వంటి ప్రాంతాల్లో జనాభా పెరగడంతో మురుగునీటి ఉత్పత్తి పెరిగింది. దీని ప్రభావం తాగునీటి కోసం పైప్‌లైన్ వేసిన డెక్టుపై పడింది. దీంతో చాలాచోట్ల మురుగునీటిలో నీటి సరఫరా పైప్‌లైన్ మునిగిపోయింది. పొరపాటున పైప్‌లైన్‌కు రంధ్రం పడినా, జాయింట్‌ల వద్ద లీకేజీ ఏర్పడినా సరే మురుగునీరు చేరే ప్రమాదం ఉంది. ఈ విషయం తెలిసినప్పటికీ జీవీఎంసీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు మూడు లక్షల మంది ఆరోగ్యానికి పొంచి వున్న పెనుముప్పు ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నిత్యం 500 కిలోలీటర్లు నీరు సరఫరా అవుతుందని అధికారులు చెబుతున్నారు. అంటే సుమారు మూడు లక్షల మంది అవసరాలను తీరుస్తోంది. మురుగునీరు పొరపాటున పైప్‌లైన్‌లోకి చేరితే వారందరి ఆరోగ్యంపై ప్రభావం పడడం ఖాయమని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల శ్రీకాకుళంలో కలుషిత నీటిని తాగడం వల్ల వందలాది మంది డయేరియాకు గురై ఆస్పత్రిపాలయ్యారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. పొరపాటున అలాంటిదేమైనా ఎండాడ పైప్‌లైన్ విషయంలో జరిగితే ఒకేసారి లక్షలాది మంది అనారోగ్యం పాలవ్వడం ఖాయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చాలి. దీనిపై జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలోని అధికారి వద్ద ప్రస్తావించగా, పైప్‌లైన్ మురుగునీటి కాలువలో ఉండడం వాస్తవమేనని, ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరయ్యాయని, మూడు నెలల్లో పైప్‌లైన్‌ను వేరొకచోటకు మార్చేస్తామని వివరించారు.

# కంబాలకొండకు బృహత్తర ప్రణాళిక తయారీ



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నగరానికి ఆక్సిజన్ బ్యాంకుగా నిలుస్తూ.. జీవవైవిధ్యానికి నెలవైన కంబాలకొండ అటవీ ప్రాంతాన్ని సంరక్షించడానికి వీఎంఆర్‌డీఏ కీలక నిర్ణయం తీసుకుంది. నిపుణుల సూచనలతో బృహత్తర ప్రణాళిక(మాస్టర్‌ప్లాన్) తయారు చేస్తోంది. కంబాలకొండ సున్నిత ప్రాంత విస్తీర్ణం 30 చ.కి.మీ.గా గుర్తించారు. ఈ ప్రాంతాన్ని నాలుగు జోన్లుగా విభజించారు. భవిష్యత్తులో వన్యప్రాణులు, పర్యావరణానికి విఘాతం కలగకుండా ఏయే పనులు చేయొచ్చో ప్రణాళికలో సూచించనున్నారు. భూవినియోగం ఇలా..రక్షిత అడవి 37 శాతం, కొండలు 33, వ్యవసాయం 10, నివాస ప్రాంతం 6, రవాణా 4, జలవనరులు 3, ఖాళీ స్థలాలు 4, విద్యాసంస్థలు 2, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ 1శాతం ఇందులో ఉన్నట్లు గుర్తించారు. పరిమిత కార్యకలాపాలకు అవకాశం: నిషేధిత ప్రాంతంలో గనుల తవ్వకాలు, కాలుష్య కారక పరిశ్రమలు, భారీ కోళ్ల ఫారాలు, నీరు కలుషితమయ్యే వ్యాపారాలు చేయకూడదు. హోటళ్లు, చిన్నపాటి భవన నిర్మాణాలు, కాలుష్య రహిత పరిశ్రమలు, మౌలిక వసతులు కల్పించుకోవచ్చు. వర్షపునీరు ఇంకేలా చేయడం, వ్యవసాయం, అడవుల పునరుద్ధరణ వంటివి చేపట్టొచ్చు. జోన్లు ఇలా.. జోన్-1 పీఎంపాలెం బిట్స్ కళాశాల-ముడసర్లోవ విద్యుత్తు సబ్‌స్టేషన్ జోన్-2: ముడసర్లోవ సబ్‌స్టేషన్ - మామిడిలోవలోని ముత్యమాంబ ఆలయం జోన్-3: ముత్యమాంబ ఆలయం- ఆనందపురంలోని ఏక్యూజే కళాశాల జోన్-4: ఏక్యూజే కళాశాల- పీఎంపాలెం బిట్స్ కళాశాల ఇవీ సవాళ్లు.. ఆనందపురంలోని దిబ్బమీదపాలెం, గంభీరం జలాశయం పరిసరాల్లో వ్యర్థాలను పారబోస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. కొమ్మాదిలోని దేవీమెట్ట, దబ్బంద, శొంఠ్యాంలోని కొన్నిచోట్ల అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేస్తున్నారు.ఆనందపురం మండలంలోని దిబ్బమీదపాలెం, దబ్బంద, గంభీరం జలాశయం పరిసరాల్లోకి తరచూ వెళ్తున్న వన్యప్రాణులు ప్రమాదాలకు గురవుతున్నాయి. అదే విధంగా విశాఖ వ్యాలీ రోడ్డు, జాతీయ రహదారి గుండా, అడవివరం రోడ్డు, సింహాచలం, శొంఠ్యాం ఏరియాల్లో ఎక్కువగా వన్యప్రాణులు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి.

# అందని ద్రాక్షలా అత్యవసర వైద్యసేవలు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రమాదం సంభవించి ప్రాణం కొట్టుమిట్టాడుతున్న వేళ ప్రతి క్షణం విలువైందే. ఎంత త్వరగా మెరుగైన వైద్యం అందితే అంత మంచిది. కానీ ప్రాణాపాయ పరిస్థితుల్లోనూ ప్రయాణం చేయక తప్పని పరిస్థితి అనకాపల్లిలో ఉంది. మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉన్నా అందుబాటులోకి రాకుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు చేశారు. 'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని' చందాన భవన నిర్మాణం పూర్తయి కొన్ని నెలలైనా.. వైద్య పరికరాలు అమర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. తొలుత ఈ ఏడాది ప్రారంభం నాటికి క్రిటికల్ కేర్ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు, స్థానిక నేతలు చెప్పారు. కానీ.. ఇంకా జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో మెరుగైన వైద్యం కోసం ఇంకా విశాఖ బాట పడుతూనే ఉన్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలో 70 కి.మీ పైగా జాతీయ రహదారి ఉంది. దీంతోపాటు పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఫార్మా కంపెనీలు అధికంగా ఉన్నాయి. జాతీయ రహదారిపై గాయపడినా.. పరిశ్రమల్లో ప్రమాదం సంభవించినా విశాఖపట్నం తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇలా నెలకు 45 మంది 60 మంది వరకు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆగమేఘాలపై



తరలిస్తున్నారు. అనకాపల్లి నుంచి పగటి వేళ కేజీహెచ్‌కు వెళ్లడానికి 2 గంటల వరకు పడుతోంది. ఈ క్రమంలో కొన్నిసార్లు పరిస్థితి విషమించి ప్రాణాలు పోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కొన్నేళ్ల క్రితం.. జిల్లా ఆసుపత్రి సమీపంలో కేంద్ర ప్రభుత్వం రూ. 24.25 కోట్లతో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వైకాపా ప్రభుత్వంలో ఈ పనులు ప్రారంభమైనా.. అసంపూర్తిగానే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు ఊపందుకున్నాయి. క్రిటికల్ కేర్ సెంటర్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమర్జన్సీ వార్డు, స్కానింగ్, ల్యాబ్, మందులకు.. మొదటి అంతస్తులో హెచ్‌డీయూ యూనిట్, గర్భిణులు ఉండేందుకు గదులు, రెండో అంతస్తులో డయాలసిస్ సెంటర్, ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించేలా పనులు చేపట్టారు.

# జీవీఎంసీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** జీవీఎంసీ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ఈనెల 17తో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పాలనా వ్యవహారాలను చక్కదిద్దడంతోపాటు కమిషనర్‌కు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. ఈ ఉత్తర్వులు ఆరు నెలలపాటు అమలులో ఉంటాయని, ఆలోపు ఎన్నికలు జరిగితే రద్దవుతాయని పేర్కొంది. జీవీఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 11 మునిసిపల్ కార్పొరేషన్లు, 75 మునిసిపాలిటీలు/నగర పంచాయతీల కార్గవర్గాల పదవీకాలం కూడా ఈనెల 17తోనే ముగుస్తుండడంతో వాటికి కూడా ప్రత్యేక అధికారులను నియమించింది. అమరావతిలో రెండు రోజులపాటు జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఇంకా పరిశ్రమలకు భూముల కేటాయింపునకు సంబంధించిన వివరాలు తీసుకువెళ్లారు.

# అందుబాటులోకి 'మన డబ్బులు మన లెక్కల' యాప్

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నర్సీపట్నం, పట్టణాల్లోనూ పొదుపు సంఘాల సొమ్ముకు ఇక మరింత భద్రత చేకూరనుంది. ఇప్పటి వరకు గ్రామాల్లోని స్వయం సహాయక గ్రూపుల మహిళలకే 'మన డబ్బులు మన లెక్కల' యాప్ పరిమితమైంది. దీనిని ఇప్పుడు పురపాలికల్లోని మహిళల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇప్పటికే దీని గురించి మున్సిపాలిటీల్లోని మహిళలకు వివరించి రిసోర్స్ పర్సన్లు వారి పొదుపు లెక్కలన్నీ సేకరిస్తున్నారు. ఇది వినియోగంలోకి వస్తే వీరి పొదుపు చిట్టాలో పూర్తి పారదర్శకత చోటుచేసుకుంటుంది. సొమ్ము పక్కదారి పట్టే పరిస్థితులకు అడ్డుకట్ట పడుతుంది. పొదుపు సంఘాల డబ్బులు చాలా చోట్ల కొందరి చేతివాటంతో దుర్వినియోగమవుతున్నాయి. సభ్యులకు ఏవో సాకులు చెప్పి సిబ్బంది వాటిని కాజేస్తున్నారు. ఇలాంటి అవకతవకలను నిరోధించేందుకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామాల్లోని మహిళల నిమిత్తం ఇప్పటికే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీనిపై అన్నింటినీ వివరించే కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పుడు పురపాలికల్లోనూ దీనిని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలోని సిబ్బంది అంతా ఇప్పటికే సిద్ధం చేసిన కార్యాచరణతో సభ్యుల పొదపు సమాచారమంతా సేకరించే పనులు చేపడుతున్నారు. జిల్లాలోని నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక సంఘాల పరిధిలోని మొత్తం 2,594 సంఘాల్లో 28 వేల మంది సభ్యులు ఉన్నారు. ఆయా సంఘాల్లో రూ. కోట్ల లావాదేవీలు కొనసాగుతున్నాయి. రెండు మున్సిపాలిటీల్లోని 98 మంది ఆర్‌పీలు ప్రస్తుతం ఇప్పటికే ఉన్న 'మహిళా ఆకాశం' యాప్ ద్వారా మొబైల్ బుక్ కీపింగ్ కింద



సభ్యులందరి పొదుపు లెక్కలను డౌన్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేసుకుంటున్నారు. మొబైల్ బుక్ కీపింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఆర్‌పీలు మన డబ్బులు మన లెక్కల యాప్ ద్వారా మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్ చేయనున్నారు. తరువాత యాప్‌ను సభ్యులందరి చరవాణుల్లో డౌన్‌లోడ్ చేసే పనులు చేపట్టనున్నారు. దీని ద్వారా ప్రతి సభ్యురాలి చేతిలోనే పొదుపు లెక్కలు సమస్తం అందుబాటులో ఉంటాయి. పైసా జమ అయినా.. ఖర్చయినా తక్షణం అందరికీ స్పష్టమవుతుంది. మన డబ్బులు మన లెక్కల యాప్ అమలుకు వీలుగా షెడ్యూల్ రూపొందించామని జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సరోజిని తెలిపారు. దీనిపై ఇప్పటికే ఆర్‌పీలకు ప్రత్యేక శిక్షణ పొందారన్నారు. వీరితో ముందుగా బాగా పనిచేస్తున్న పొదుపు సంఘాలు తరువాత మిగతా వాటి నుంచి సమాచారం సేకరించేలా ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారుతరువాత మిగతా వాటి నుంచి సమాచారం సేకరించేలా ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు.

# ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాలలో 'అరెటె హోమియోపాథికా' రాష్ట్రస్థాయి సదస్సు దిగ్విజయం

- పాల్గొన్న 300 మంది ప్రతినిధులు; హోమియోపతిని 'గ్రీన్ మెడిసిన్'గా అభివర్ణించిన నిపుణులు
- బోధనా సిబ్బందికి 'వరల్డ్ టీచర్ ట్రస్ట్' ఘన సత్కారం
- ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద కుమార్ ఆధ్వర్యంలో 'సైంటిఫిక్ ఇన్వెస్టిగేటర్'గా కేస్ టేకింగ్‌పై మాస్టర్ క్లాస్
- కళాశాల చరిత్రలో తొలిసారిగా భారీ 'ఇఫ్తార్ విందు' నిర్వహణ

**తాడేపల్లిగూడెం, మార్చి 11, 2026:**
స్థానిక ఏఎస్ఆర్ (ఙూా=) హోమియోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఆవరణలో, వరల్డ్ టీచర్ ట్రస్ట్ మరియు ఆలీషా అకాడమీ సహకారంతో 'అరెటె హోమియోపాథికా' (ఙూతీవ్వ ఎశీఎవశీజూఝ్ట్రఱఝు) రాష్ట్రస్థాయి సెమినార్ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మంది సీనియర్ వైద్యులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఘన నివాళులు - స్ఫూర్తిదాయక ప్రారంభం:**
కార్యక్రమం ప్రారంభంలో హోమియోపతి పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్, ఏఎస్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు శ్రీ ఆకుల శ్రీరాములు మరియు జగద్గురు పీఠం వ్యవస్థాపకులు మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి మాట్లాడుతూ, ఏఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఆకుల విజయ్ వర్ధన్ గారి నిరంతర ప్రోత్సాహం మరియు మార్గదర్శకత్వమే ఈ సదస్సు విజయానికి మూలమని కొనియాడారు.

**అధ్యాపకులకు గౌరవం:**
హోమియోపతి వైద్య విద్యకు ఏఎస్ఆర్ కళాశాల అధ్యాపకులు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, వరల్డ్ టీచర్ ట్రస్ట్ ప్రతినిధులు కళాశాల బోధనా సిబ్బంది అందరినీ ఘనంగా సత్కరించారు.

ప్రముఖ వక్తలు – శాస్త్రీయ విశ్లేషణ:
ఈ సదస్సులో పలువురు నిపుణులు హోమియోపతిలోని

**విభిన్న అంశాలపై లోతైన విశ్లేషణ చేశారు:**
డాక్టర్ జి.ఏ.వి. రామేశ్వర్ (ఆంధ్ర యూనివర్సిటీ): మాస్టర్ ఈకే గారి ఆశయ సాధనలో భాగంగా హోమియోపతి అభివృద్ధిని వివరిస్తూ, ఆంధ్ర యూనివర్సిటీలో 24 ఏళ్లుగా కొనసాగుతున్న హోమియో డిస్పెన్సరీ విజయగాథను పంచుకున్నారు.

పర్యావరణ హితమైన 'గ్రీన్ మెడిసిన్': ఆంధ్ర విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ ఈ. ఉదయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, హోమియోపతి అత్యంత తక్కువ 'కార్బన్ ఫుట్ ప్రింట్' కలిగిన వైద్యమని, రసాయన వ్యర్థాలు లేని ఈ విధానం పర్యావరణానికి మేలు చేసే 'గ్రీన్ మెడిసిన్' అని పేర్కొన్నారు.

డాక్టర్ పి.వి. రాఘవరావు (కాకినాడ): 'ఆర్గనాన్ ఆఫ్ మెడిసిన్' సూత్రాలను పాటిస్తే అత్యవసర మరియు దీర్ఘకాలిక వ్యాధులలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఉదాహరణలతో వివరించారు.



డాక్టర్ జి.ఆర్.ఎస్.ఎస్. శర్మ: ప్రాక్టీస్‌లో మెటీరియా మెడికాను అధ్యయనం చేసే విధానంపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

డాక్టర్ శ్రీకాంత్ (రాజమండ్రి): హోమియోపతి యొక్క మూలతత్వాన్ని వివరిస్తూ, నయమైన కేసుల వివరాలను వెల్లడించారు.

ప్రొఫెసర్ డాక్టర్ ఆనందరావు సనపాల: 'ది ఆర్కిటెక్చర్ ఆఫ్ ఇన్ సెక్యూరిటీ' అంశంపై క్యాల్కేరియా గ్రూప్ ఔషధాల మానసిక స్థితిని విశ్లేషించారు.

డాక్టర్ ఎ. భవ్య లక్ష్మి కుమారి: ఆధునిక ప్రాక్టీస్‌లో 'ర్యాపిడ్ ఇండివిడ్యులైజ్డ్ కాన్స్టిట్యూషనల్ ప్రిస్క్రిప్షన్' ప్రాముఖ్యతను వివరించారు.

డాక్టర్ డి. సాయిరామ్ & డాక్టర్ శ్రీ హనుమంతరావు: థైరాయిడ్ సమస్యలు మరియు థైరోగ్లోసల్ సిస్ట్ చికిత్సలో హోమియోపతి పనితీరును వివరించారు.

డాక్టర్ పి. రాధా: హోమియోపతి ప్రాక్టీస్‌లో 'రుబ్రిక్స్' ఎంపిక చేసుకునే కళను వివరించారు.

**మాస్టర్ క్లాస్: 'గన్‌షాట్' ప్రిస్క్రిప్షన్లే లక్ష్యం:**
ముగింపు సెషన్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి "ది సైంటిఫిక్ ఇన్వెస్టిగేటర్: కేస్ టేకింగ్ మరియు బోనింగ్ హుస్సేన్ టోటాలిటీ" అంశంపై ప్రసంగించారు. హోమియోపతిలో కేవలం వ్యాధి లక్షణాలనే కాకుండా, రోగిని ఒక వ్యక్తిగా అర్థం చేసుకునే 'సైంటిఫిక్ ఇన్వెస్టిగేటర్'గా వైద్యులు మారాలని, అప్పుడే కచ్చితమైన 'గన్‌షాట్' ప్రిస్క్రిప్షన్లు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు.

మత సామరస్యానికి ప్రతీకగా 'ఇఫ్తార్ విందు':
సదస్సు విజయవంతంగా ముగిసిన సందర్భంగా కళాశాల చరిత్రలో తొలిసారిగా భారీ ఇఫ్తార్ విందు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఈ విందు నిర్వహించడం సంతోషంగా ఉందని, మత సామరస్యానికి ప్రతీకగా సంక్రాంతి, వినాయక చవితి, క్రిస్మస్ తరహాలోనే ఇకపై ప్రతి ఏటా ఇఫ్తార్ విందును కూడా నిర్వహిస్తామని డాక్టర్ ఆనంద కుమార్ ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ విద్యాసంస్థల ప్రతినిధులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పది పరీక్షలకు ఏర్పాట్లు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు నిర్ణీత రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఇప్పటికే మండల కేంద్రాలకు తరలించి పోలీసు స్టేషన్లలో భద్ర పరిచారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 14,309 మంది, ప్రైవేటు స్కూళ్ల నుంచి 6,268 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితోపాటు గత ఏడాది పదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయిన 440 మంది కంపార్ట్‌మెంట్ విద్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నారు. మొత్తం 21,017 మంది విద్యార్థుల కోసం 102 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. మండల విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణలో చూసిరాతలకు తావులేకుండా పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తారు. కాగా పరీక్షలు జరిగే రోజుల్లో పదో తరగతి విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు రాకపోకలు సాగించేందుకు ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్ల హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు ప్రకటించారు. పరీక్ష ప్రారంభం కావడానికి గంట ముందు నుంచి, పరీక్ష ముగిసిన గంట తరువాత వరకు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా



బస్సులు నడపాలని కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శత శాతం ఉత్తీర్ణతకు తీవ్ర కృషి పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'వంద రోజుల ప్రణాళిక'ను అమలు చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాల వారీగా చదివించి, టెస్టులు పెడుతున్నారు. గత నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో తగిన మార్కులు రాని విద్యార్థులను సమీపంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉంచి చదివిస్తున్నారు. మళ్లీ ఈ నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రాండ్ టెస్టు నిర్వహించారు.

# విద్యార్థి మృతికేసులో నిందితుడి అరెస్టు




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** మండలంలోని ఏటికొప్పాక శివారులో నాటు తుపాకీ పేలి ఆడారి వెంకట కౌశిక్(12) అనే విద్యార్థి మృతిచెందిన కేసుకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్టు పరవాడ ఇన్‌చార్జ్ డీఎస్పీ బి.మోహన్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఏటికొప్పాక గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు మధ్యాహ్నం గ్రామ శివారులోని వరహా నదిలో ఆనకట్ట వద్దకు వెళ్లారు. అక్కడ సరదాగా గడిపిన అనంతరం వీరిలో ఒక విద్యార్థి.. తమ ఇంటిలో రెండు నాటు తుపాకులు వున్నాయని, వాటిని చూపిస్తానని చెప్పడంతో అంతా కలిసి సమీపంలో వున్న అతని కమ్మల ఇంటికి వెళ్లారు. తన తండ్రి కశింకోట సూరిబాబు తుపాకులను ఎలా వాడతారో చూపిస్తుండగా ప్రమాదవశాత్తూ పేలింది. పక్కనున్న ఆడారి వెంకట కౌశిక్‌కు తూటాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే పిల్లలంతా భయంతో పారిపోయారు. ఈ సమయంలో అక్కడే వున్న సూరిబాబు భయపడి కౌశిక్ మృతదేహాన్ని ఇంటికి సమీపంలో ఉన్న తుప్పల్లో పడవేసి, తుపాకులతో సహా కుమారుడిని తీసుకొని పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ ఉపేంద్ర, ఎస్‌ఐలు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కశింకోట సూరిబాబు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మల్లవరం సమీపంలో పట్టుకొని అరెస్టు చేశారు. రెండు నాటు తుపాకులు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి గన్‌పౌడర్ సరఫరా చేసిన కశింకోటకు చెందిన ముత్యాల అప్పల రమణ, మరొకరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
గురువారం 12-3-2026

# సోషల్‌మీడియాపై ఉక్కుపాదమా?

భావప్రకటన స్వేచ్ఛే అన్ని స్వేచ్ఛలకు పునాది. మనసులో భావాలు చెప్పుకొనే స్వేచ్ఛ.. ఒక హక్కు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు కూడా అందులో భాగమే. ఆ హక్కు లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు. ప్రజాక్షేమం పట్టని పాలకులు, సమాధానాలు చెప్పుకోలేని విఫల నాయకులు, తమ విధానాలపై విశ్వాసంలేని నియంతలు తమను ప్రశ్నిస్తే సహించరు అనేది చరిత్ర చెప్పిన సత్యం. ప్రజాస్వామిక హక్కుల కోసం గొంతెత్తిన ప్రజల, ప్రజల కోసం గొంతెత్తిన ప్రజాస్వామికవాదుల ప్రాణాలు తీసిన పాలకులు చరిత్రలో కనిపిస్తారు. ఆ నెత్తుటి మరకలు చరిత్ర పుటల్లో నిక్షిప్తమై ఉన్నాయి. ఇటీవలి చరిత్ర చూసినా అలాంటి ఆనవాళ్లు మన ముందు ప్రత్యక్ష ఉదాహరణలుగా కనిపిస్తాయి. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపైనా ఇలాంటి చర్చనే నడుస్తున్నది. సోషల్ మీడియాను నియంత్రించేందుకు కొత్త చట్టం తీసుకొస్తానని సీఎం ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మసిపూసి మారేడు కాయ చేసినట్టుగా ఆయన చెప్పిన మాటలు ఫేక్ న్యూస్ నియంత్రణ అనే రంగును పులిమినట్టు కనిపిస్తున్నది. కానీ రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ తరహా అరెస్టులు, నిలదిస్తే నిర్బంధాలు చూస్తున్నాం. ఇలాంటి అనుభవాల పరంపరలో ఏర్పడిన ఆలోచన దృక్పథంలో చూస్తే రేవంత్‌రెడ్డి మాటల్లో మర్మం అర్థం చేసుకోవచ్చు. సంప్రదాయ మీడియాకు దీటుగా ప్రభావవంతమైన వేదికగా నిలుస్తున్న సామాజిక మాధ్యమాలపైనా పాలకుల కన్నుపడింది. ప్రస్తుతం సోషల్‌మీడియాలో ఏమైనా తప్పులు జరిగితే శిక్షించేందుకు చట్టాలు ఉన్నాయి. ఫేక్‌న్యూస్, దూషణలు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత, సుప్రీంకోర్టు తీర్పులు, విధివిధానాలు, మార్గదర్శకాలు ఉన్నాయి. మరి కొత్తగా సీఎం తెస్తానన్న చట్టంలో ఏమి ఉండబోతున్నది? అనేది ప్రశ్న. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలు నిలదీస్తుంటే కాంగ్రెస్ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమాధానాలు లేవు కాబట్టే అసలు ప్రశ్నలే లేకుండా చేయాలని రేవంత్‌రెడ్డి జిమ్మిక్కులు చేస్తున్నట్టు కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు గల్లంతయ్యాయి. గత ప్రభుత్వం అమలు చేసిన మానవీయ పథకాల జాడ ఇప్పుడు లేదు. మోసపోయి గోస పడుతున్నామని ప్రజలు నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. ఘనత వహించిన తమ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పుకొన్నారు. చెత్త తీసుకపోయేటోళ్లు మాట వింటలేరని, పని చేస్తలేరని సెలవిచ్చారు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టుగా సీఎం మాటలు ఉన్నాయి. కనీసం పారిశుధ్య నిర్వహణ కూడా తమకు చేతగావడంలేదని సీఎం మాట్లాడితే ఇక ప్రజలు ఈ కాంగ్రెస్ పాలన గురించి ఏమి అనుకోవాలో ఆయనే చెప్పాలి! రాష్ట్రం పదేండ్ల తర్వాత ఏయే రంగాల్లో ఎలా ఉండాలో ఆలోచించి దార్శనిక ప్రణాళికలు రచించడం, ఆ దిశగా కార్యాచరణ రూపొందించడం, అమలు చేయడం, ఫలితాలు సాధించడం అనే బృహత్తర కార్యాన్ని కాంగ్రెస్ పాలకుల నుంచి ఆశించడం అత్యాశనే అవుతుంది. ఇన్ని అవలక్షణాలు, అడ్డగోలు విధానాలు, పేదల పొట్టగొట్టే అమానవీయ వైఖరులు, ఇండ్లు కూల్చే దుర్మార్గాలు గల పాలకులను ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తున్నది.

సోషల్ మీడియా వేదికగా జరిగే తప్పుడు ప్రచారం ఎవరికి మేలు చేసిందంటే అది ముమ్మాటికీ కాంగ్రెస్‌కే. బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అనుకూల, చెల్లింపు మీడియా విష ప్రచారం చేసింది. కానీ నాటి ప్రభుత్వం కక్ష సాధింపులకు పోలేదు. మానవీయ దృక్పథంతో, బృహత్తర ఆశయాలతో పని చేసింది. కానీ కాంగ్రెస్ మాత్రం తన ఎమర్జెన్సీ వాసనల నుంచి పూర్తిగా బయటపడనట్టు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వందల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, సోషల్‌మీడియా వారియర్లపై కేసులు నమోదు చేసింది. ఒకటే అంశంపై పలు పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ చేసి వేధింపులకు పాల్పడుతున్నది. కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరి హద్దులు దాటడంతో హైకోర్టు మొట్టికాయలు వేసింది. నల్లబాలు కేసులో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావని తేల్చిచెప్పింది. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా నిరుడు ఫిబ్రవరిలో అత్యున్నత న్యాయస్థానంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. నల్లబాలుపై నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లను ధర్మాసనం రద్దు చేసింది. విమర్శించడం భారత పౌరుడి వ్యక్తిగత స్వేచ్ఛ అని, మూడో వ్యక్తి చేసే ఫిర్యాదుపై కేసులేవీ పెట్టొద్దని, మేజిస్ట్రేట్ ఆదేశిస్తేనే కేసు నమోదు చేయాలని తేల్చిచెప్పింది. 'తలుగు తెంచుకున్న దొంగబర్రెకు ముక్కు తాడు వేసినట్టు'గా కాంగ్రెస్ తీరుపై సుప్రీంకోర్టు తీర్పు ఉన్నది. ప్రభుత్వం కొత్త చట్టాలు తెచ్చినా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు, ఆర్టికల్ 19(1)(ఏ)కు లోబడి ఉండాల్సిందే. ఇక పాలకులు ఓ విషయం గుర్తుంచుకోవాలి. నచ్చని భావాలు వ్యక్తం చేసే ఇతరుల భావప్రకటన స్వేచ్ఛను గౌరవించకపోతే.. తాము అనుభవిస్తున్న స్వేచ్ఛ పట్ల కూడా వారికి నమ్మకంలేదని అనుకోవాల్సి ఉంటుంది.

# చిత్తవైకల్యం (Dementia) - మెదడు మరియు జ్ఞాపకశక్తి ఆటలు

డిమెన్షియా అంటే చిత్తవైకల్యం లేదా చిత్త భ్రంశం. ఇది జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, ప్రవర్తన మరియు దైనందిన పనులను నిర్వహించే శక్తిని దెబ్బతీసే మెదడుకు సంబంధించిన వ్యాధుల సమూహం. ఇది ఒక నిర్దిష్ట వ్యాధి కాదు, కానీ మెదడు దెబ్బతినడం వల్ల వచ్చే లక్షణాల సముదాయం, ఇది ముఖ్యంగా వృద్ధులను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి ఉన్నవారు రోజువారీ పనులు (స్నానం, ఆహారం, దుస్తులు ధరించడం) చేసుకోవడంలో ఇబ్బంది పడతారు.

చిత్తవైకల్యానికి సంపూర్ణ చికిత్స లేనప్పటికీ, కొన్ని చికిత్సా ఎంపికలు లక్షణాల నుండి ఉపశమనం పొందటానికి మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

మెదడును ఉత్తేజపరిచేందుకు ఆటలు గొప్ప మార్గం అని మనకు దశాబ్దాలుగా తెలుసు. ఆటలు మన మెదడును ఉత్తేజపరచడంలో సహాయపడతాయి. అయితే, అవి ఏ నైపుణ్యాలకు శిక్షణ ఇవ్వవచ్చనే విషయానికి వస్తే అన్ని ఆటలు సమానమైన ఫలితాలు ఇవ్వవు. కానీ వృద్ధులకు, ముఖ్యంగా చిత్తవైకల్యం ప్రమాదం ఉన్నవారికి ఇవి చాలా ఉపయోగపడతాయి.

మెదడు ఆటలు ఎలా సహాయపడతాయి?

కొన్ని పరిశోధనల ప్రకారం, ఈ ఆటలు మెదడులోని బూడిద పదార్థం పరిమాణాన్ని పెంచడానికి మరియు నాడీ సంబంధిత మార్గాలను బలోపేతం చేయడానికి తోడ్పడతాయి అని తెలుస్తోంది.

వీటి వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు:

జ్ఞాపకశక్తి: స్వల్పకాలిక జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.

తార్కిక ఆలోచన: సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుంది.

కమ్యూనికేషన్: ఇతరులతో సంభాషించడం మరియు భావ వ్యక్తీకరణ సులభమవుతుంది.

భావోద్వేగ నియంత్రణ: చిత్తవైకల్యం వల్ల కలిగే ఆందోళన తగ్గుతుంది.

ముఖ్యమైన ఆటలు మరియు వాటి ఉపయోగాలు:

పద పజిల్స్ (క్రాస్‌వర్డ్స్, అనగ్రామ్‌లు జ్ఞాపకశక్తి కోల్పోవడాన్ని ఆలస్యం చేస్తాయి.

జిగ్సా పజిల్స్ : మెదడుపై వృద్ధాప్య ప్రభావాన్ని తగ్గించి, ఏకాగ్రతను పెంచుతాయి.

బోర్డ్ గేమ్‌లు: సామాజిక సంబంధాలను పెంపొందించి, మెదడును చురుగ్గా ఉంచుతాయి.

వీడియో గేమ్‌లు: ప్రతిచర్య సమయం (=ఋఖ్ఱశీఅ్ ఱఎవ) మరియు తార్కిక ఆలోచనను మెరుగుపరుస్తాయి.

వర్చువల్ రియాలిటీ అభ్యాసనను శారీరక వ్యాయామంతో కలిపి ఒక కొత్త అనుభూతిని ఇస్తాయి.

తీవ్రతను బట్టి కార్యకలాపాలు:

చిత్తవైకల్యం దశను బట్టి ఆటలను ఎంచుకోవడం ముఖ్యం:

1. ప్రారంభ దశ: క్రాస్‌వర్డ్ పజిల్స్, చెస్, కంప్యూటర్ గేమ్స్ వంటి క్లిష్టమైన ఆటలు ఆడవచ్చు.
2. మధ్య దశ: సాధారణ బోర్డ్ గేమ్స్, కార్డ్ గేమ్స్ లేదా జిగ్సా పజిల్స్ మెరుగ్గా పనిచేస్తాయి.
3. తీవ్రమైన దశ: క్లిష్టమైన ఆటలు ఆడలేనప్పుడు సంగీతం వినడం, పాత ఫోటోలు చూడటం లేదా మృదువైన వస్తువులతో ఆడుకోవడం వంటివి మానసిక ప్రశాంతతను ఇస్తాయి.

మెదడు ఆటలు చిత్తవైకల్యానికి సంపూర్ణ చికిత్స కాకపోయినప్పటికీ, రోగుల జీవన ప్రమాణాలను (ఝఖ్రశ్రీఱ్‌ఎ శీట ూఱటవ) మెరుగుపరచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

చిత్తవైకల్యం ఉన్నవారి కోసం రోజువారీ మెదడు వ్యాయామ ప్రణాళిక మరియు కొన్ని ఉపయోగకరమైన చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. మీరు దీనిని ఒక గైడ్‌గా ఉపయోగించవచ్చు:

చిత్తవైకల్యం ఉన్నవారి కోసం రోజువారీ కార్యాచరణ ప్రణాళిక:

ఉదయం (15-20 నిమిషాలు): వార్తాపత్రిక చదవడం లేదా తేదీని గుర్తించడం: ఈ రోజు ఏ వారం, ఏ తేదీ అని అడగడం వలన ప్రస్తుత కాలంపై అవగాహన పెరుగుతుంది.

మధ్యాహ్నం (20-30 నిమిషాలు):

పద శోధన లేదా జిగ్సా పజిల్స్: సులభమైన పదాలను వెతకడం లేదా చిత్రాలను అమర్చడం వలన తార్కిక ఆలోచన మరియు ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది.

సాయంత్రం (30 నిమిషాలు):

పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం : పాత ఫోటో ఆల్బమ్స్ చూడటం లేదా పాత పాటలు వినడం వలన దీర్ఘకాలిక జ్ఞాపకశక్తిని ప్రేరేపిస్తుంది మరియు ఆనందాన్ని ఇస్తుంది.

రాత్రి (10 నిమిషాలు):

సరళమైన సంభాషణ: ఈరోజు జరిగిన మంచి విషయం గురించి మాట్లాడటం వలన భాషా నైపుణ్యాలను మరియు భావోద్వేగ బంధాన్ని పెంచుతుంది.

ఇంట్లోనే తయారు చేసుకోగలిగే కొన్ని సాధారణ మెమరీ గేమ్స్:

1. వస్తువును గుర్తించు: ఒక ట్రేలో 5-6 రకాల వస్తువులను (తాళం చెవి, పెన్ను, పండు మొదలైనవి) ఉంచి, ఒక నిమిషం చూపించి, ఆపై బట్టతో కప్పి ఉంచండి. వాటిలో ఏమేమి ఉన్నాయో గుర్తు తెచ్చుకోమని చెప్పండి.
2. రంగుల వర్గీకరణ: వేర్వేరు రంగుల బటన్లు లేదా పూసలను కలిపి ఉంచి, వాటిని రంగుల వారీగా వేరు చేయమని చెప్పండి. ఇది ఏకాగ్రతకు చాలా మంచిది.
3. పాటను పూర్తి చేయండి: వారికి ఇష్టమైన పాత పాటను సగంలో ఆపి, తర్వాతి పదాలను పాడమని ప్రోత్సహించండి.

గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు:

ఒత్తిడి వద్దు: వారు ఏదైనా మర్చిపోతే లేదా పజిల్ పూర్తి చేయలేకపోతే వారిని విమర్శించవద్దు. ఇది కేవలం మెదడుకు వ్యాయామం మాత్రమే, పరీక్ష కాదు.

ప్రోత్సాహం: వారు చిన్న పని చేసినా అభినందించండి. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

సౌకర్యం: వారికి నచ్చిన ఆటలనే ఎంచుకోండి. బలవంతంగా ఏదైనా చేయించడం వల్ల వారు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది.

ఒక సమీక్ష ప్రకారం, చిత్తవైకల్యం ఉన్న ప్రారంభ దశ మరియు మధ్య-దశ రోగులపై ఆటలను ఉపయోగించినప్పుడు, వారి స్వల్పకాలిక జ్ఞాపకశక్తి, ప్రతిచర్య సమయం, సమస్య పరిష్కారం, తార్కిక తార్కికం, కమ్యూనికేషన్ వంటి అనేక రకాల అభిజ్ఞా సామర్థ్యాలను మెరుగుపరచగలిగారు.

అయినప్పటికీ, చిత్తవైకల్యం చికిత్సలో మెదడును ఉత్తేజపరిచే ఆటల పాత్ర కొంత ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ఈ దిశగా మరిన్ని పరిశోధనలు అవసరం.

దీని గురించి మరింత ఖచ్చితమైన సమాచారం కోసం వైద్యులను సంప్రదించడం మంచిది.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# కుటుంబం నుంచే మానవత్వ పునాది

"మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడూ మచ్చుకైనా లేడు చూడూ మానవత్వం ఉన్నవాడు. నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు యాడవున్నాడో కాని కంటికి కనరాడు" అందెశ్రీ 1994 లో మానవీయ విలువలపై రాసిన గీతం, ఈనాటి పరిస్థితులకు అద్దం పట్టే సరైన గీతం. మమతకు అర్థం ఎరగనివాడు మానవత్వం వైపు ఎలా తిరగగలడు? మనసుని స్థిరపర్చుకుని విచక్షణతో క్షణకాలం ఆలోచించే తీరిక, ఓపిక ఉండనివాడు ఏమి సాధిస్తాడు. ప్రతి విషయంలో తన స్వార్థం కోసం, పక్క వాడితో పోటీ పడి పరుగు పందెంలో పరుగెత్త లేక అలసి పడి పోయే వాడు లక్ష్యాలు నిజాయితీగా ఎలా చేరుకుంటాడు. తల్లికి పిల్లల బాగోగులు చూసే ఖాళీ దొరకదు. భర్తకు, భార్యతో మాట్లాడే తీరిక,కోరిక వుండవు. కుటుంబం అంతా కలిసే అవకాశమే రానేరాదు. వీళ్లందరికీ ఎందుకు ఎప్పుడూ తీరికే ఉండదు? ఏమో వాళ్లకే తెలియనంత బిజీ. ఎందుకని అడిగితే, ప్రస్తుత కాలమాన పరిస్థితుల ప్రకారం కాలంతో పరిగెత్తాల్సిందే,ఇంతే అంటారు. ఇలాంటి సమయంలో మనుషులు,మమతలు, అనురాగం,ఆత్మీయత లాంటి బంధాల గురించి చెప్పాలనుకోవడం అసమంజసం కాదేమో అనిపిస్తుంది.

ప్రకృతిలో, పశు పక్ష్యాదుల నుంచి మనుషుల వరకు, పిల్లల కోసం, వాళ్లు పుట్టి పెరిగే దాకా, తల్లులు పడే అమితమైన ఆరాటం,తపన అసమానం,అనిర్వచనీయం. ఇది ప్రకృతి ఏర్పరిచిన విడదీయ లేని సహజ బంధం. ఇక తండ్రి పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించి పెద్దయ్యే వరకూ ఆయన చేయి పట్టుకుని నడిపించడం, కొడుకు లేక కూతురు అడిగిందల్లా చేయడం ఆయన కర్తవ్యంగా భావించి ఆత్మీయత పంచడం, తల్లి తర్వాత పిల్లలకు తండ్రి రెండో అనుబంధం. ఇవి రక్త సంబంధాలు. వీరి తర్వాత తమ సహోదరులు(అన్న,తమ్ముడు,అక్కా,చెల్లి) తాత,నాన్నమ్మ, ఇదంతా ఒక ఉమ్మడి కుటుంబం. ఇప్పుడు కుటుంబం అంటే అమ్మ,నాన్న,ఇద్దరు పిల్లలు అంతే. పిల్లలకు పాఠశాలలో ఆడుకోవడానికి ఆట స్థలం ఉండదు. ఇంటిలో మాట్లాడడానికి తల్లిదండ్రులు ఉద్యోగాలతో బిజీ,ఖాళీ వుండదు. ఇక మిగిలింది స్నేహితులు,వారు సరైన వారు కాకపోతే తల్లిదండ్రులకు నరకమే. అందుకే, మన జీవితాలను చిన్నప్పటి నుంచి ప్రభావితం చేసే స్నేహితులు, గురువులు, తర్వాత మనం సరైన దారిలో లేకపోతే కాకుల్లా పొడిచి విమర్శించే చుట్టూ ఉన్న సమాజం మన మంచి, చెడులకు కారకులు. మొదట తల్లిదండ్రుల పాత్ర, వారు పిల్లల బాగోగులను పట్టించుకుని వారికి తెలియకుండా నిత్యం గమనిస్తూ, మంచి నడవడిక వైపు సున్నితంగా మార్గదర్శనం చేయాలి. ఇక్కడ మనం చెప్పే దాన్ని మనం ఆచరిస్తూ వారికి చెప్పాలి. అప్పుడే మనం చెప్పే మంచిని వారూ ఆచరిస్తారు. లేకపోతే విన్నట్లు చేసినట్లు, నటిస్తారు. ఉదాహరణకు మనం మిగతా వారికి సాయం చేస్తూ,ఇంట్లో మన తల్లిదండ్రులను కూడా వృద్ధాప్యంలో చేయి పట్టుకుని,ఆదరించి,ఆదుకోవాలి. అప్పుడే వారూ, మనకూ మిగతావారికి,అవసరానికి ఆదుకొని,రేపు వృద్ధాప్యంలో కూడా వారు మనకూ సహాయపడ్తారు. ఈ విషయం తెలిసి కూడా కొంత మంది అలా పెద్దలకు సహాయపడలేక పోతున్నారు. కారణం,అలాంటి వాళ్లకి ప్రస్తుతమే ముఖ్యం. జరినవి, రాబోయే విషయాలు అప్రస్తుతం. ఈ రోజు ఆనందంగా గడపాలి. అందుకే ఎక్కడ ఏ సెలబ్రేషన్ వున్నా తీరిక చేసుకుని ఓపిగ్గా అలంకరించుకుని పిల్లలను వదిలి మరీ వెళ్తారు. మిగతా విషయాలకు మాత్రం అసలు తీరిక వుండదు. పిల్లల పట్ల సరైన బాధ్యత తీసుకోరు. పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ,మమత,అనురాగాలే, వారి పట్ల మనం చూపే బాధ్యతలే, పిల్లలు గొప్పగా ఎదగడానికి మార్గదర్శకాలు అవుతాయి. ఆ రకమైన మార్గనిర్దేశం లేక పిల్లలు చెడ్డ దారులలో పడి, గతి తప్పి,దొంగలుగా,నేరస్తులుగా మారుతున్నారు.

ఇక కొన్ని భార్యాభర్తల సంబంధాలు కూడా కొంత వరకు మమతలకు, మమకారాలకు ప్రేమలకు కాస్త ఎడంగానే నడుస్తున్నాయి. భార్యాభర్తల మధ్య అవగాహన, ఒకరి మనో భావాలను ఇంకొకరు గౌరవించడం అర్థం చేసుకోవడం, సర్దుబాటు తప్పని సరిగా ఉండాలి. మూడవ వ్యక్తి జోక్యం ఉండరాదు. ఇక ప్రేమలు విషయానికి వస్తే, పెళ్లి పీటలు ఎక్కకుండానే,తల్లిదండ్రుల చేతిలో పరువు హత్యల రూపంలోనో,ఆత్మహత్య చేసుకోవడమో,లేదా వారిద్దరిలో ఏదో అతి చిన్న విషయంలో(అది ఇగో కావచ్చు) మనస్పర్థల కారణంగా బ్రేకప్(విడిపోవడం) రూపంలో మారి పెళ్లి కాక, ఒంటరి జీవితాన్ని భారంగా నడిపించడం చూస్తూనే వున్నాం. ఇలా జరగడానికి, పిల్లలకు ఊహ తెలిసే వయస్సు నుంచే పెంపకంలో ఆత్మీయ భావనలు ఒకరిపట్ల మరొకరికి మమత అనురాగాలు, సానుభూతి,దయ లాంటి అనుభూతులు తల్లి, తండ్రులు వారికి కలగజేయకపోవడమే కారణం. కొంతమంది, వాళ్లని చదువుల పేరుతో లేక అల్లరి చేస్తున్నాడనే నెపంతో హాస్టల్ లో పడేసి వాళ్ల బాల్యాన్ని ఓ ఆటాపాటా,ముద్దు ముచ్చటా లేకుండా వాళ్ల భావ ప్రకటనకు అవకాశమీయకుండా చిన్నప్పుడే వాళ్లను కట్టి పడేస్తున్నారు. కొంతమంది పిల్లలు మనసులో వ్యతిరేక భావనలు కరడు కట్టి, వారి యుక్త వయస్సు నాటికి ఒక తీవ్ర ప్రతీకార వాంఛగా మారి, వారు సంఘ వ్యతిరేక శక్తులై, సమాజానికి ఒక ప్రశ్నగా మారుతున్నారు.

ముఖ్యంగా పిల్లల్లో, యుక్త వయసులో ఉన్నవారిలో భావావేశం ఎక్కువగా ఉంటుంది. మీడియాలో రోజూ వినిపిస్తున్న, కనిపిస్తున్న హత్య,మానభంగాల వార్తలు, సినిమాలో కన్పించే అతివాస్తవిక, వివరణాత్మక నేర కథలకు, సెల్ ఫోనులలో వచ్చే కంటెంట్ లకు ఆకర్షితులై, ప్రభావితులౌతారు, కొంతమంది తాము కూడా ఆ రకంగా చేయడానికి ప్రయత్నం చేసి అనవసరంగా నేరస్తులు కావడం చూస్తున్నాం. కనుక ఆ విధమైన వార్తలు కొంత తగ్గించి వివరణ లేకుండా అవసరమైతేనే వ్రాయడం, సమాజ శ్రేయస్సు దృష్ట్యా మంచిది. నేరాలు,ఘోరాలు శీర్షికలను సాధ్యమైనంతవరకు తగ్గించడం, అనుబంధాలు, ఆత్మీయతలు,మానవత్వానికి సంబంధించిన వార్తలు ప్రసారం చేయడం, యువతరానికి, పిల్లలకు మంచిది. ఇవి ప్రసార మాధ్యమాలు తమ స్వీయ కట్టుబాటును ఏర్పాటు చేసుకుని అంతా క్రమశిక్షణతో సమాజ శ్రేయస్సుకై ఆచరణలో పెట్టాలి. ఇక సినిమాల్లో,ఓటిటి మాధ్యమాలలో, సమాజ సంబంధిత,హాస్య,కుటుంబ, దేశభక్తి సంబంధిత కథా చిత్రాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ మధ్య, కొన్ని ఇలాంటి సినిమాలు వచ్చినప్పుడు, ప్రేక్షకఆదరణ బాగా కన్పించింది. హింస, రక్తపాత సన్నివేశాలు పూర్తిగా తగ్గించాలి. ఇకపిల్లల విషయంలో క్రమశిక్షణ, శారీరక వ్యాయామం, యోగాభ్యాసం,పఠనాసక్తి పెంచి, సమతుల్య ఆహారాన్నిచ్చి కాబోయే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. దీనికి ప్రభుత్వం కొంత, ఉపాధ్యాయులు కొంత, మీడియా కొంత, పౌరులుగా మనం కొంత,పిల్లల తల్లిదండ్రులు పూర్తిగా బాధ్యత తీసుకోవాలి. చివరగా మనుషులంతా, మానవత్వంతో తోటివారికి సాయపడుతూ, మమతలు అనురాగాలతో కుటుంబానికి ప్రేమను పంచుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎక్కడ ఉన్నా, వసుధైక కుటుంబ భావనను పెంచుతూ, విశ్వ కళ్యాణానికి దోహదపడాలి. అప్పుడే కుటుంబం, సమాజం,దేశం పచ్చగా ఉండి మమతానురాగాలతో మానవత్వం పరిఢవిల్లుతుంది.

**బూర్గుల రామకృష్ణ సాయి**

# ఆత్మహత్యను రామకథతో నివారించిన హనుమ

సీతమ్మ తన జుట్టుని ఆ శింశుపావృక్షం కొమ్మకి గట్టిగా బిగించి చనిపోదామని సిద్ధపడుతున్న తరుణంలో ఆమెకి శుభశకునాలు కనపడ్డాయి. సరోవరంలో నీటి పైన అరవిసిరిన తెల్ల పద్మం, నీటి లోపల ఉన్న కాడను ఒక చేప తగలడం వలన కాడతోపాటు పైన ఉన్న పువ్వు కూడా కదిలింది. ఆ పువ్వు ఎలా కదిలిందో సీతమ్మ కన్ను కూడా ఆ సమయంలో అలా అందంగా అటూ ఇటూ కదిలింది.


అప్పటిదాకా చెట్టు పైన ఉండి సీతమ్మని చూస్తున్న హనుమ అనుకున్నాడు. 'ఈశ్వరానుగ్రహం చేత నాకు సీతమ్మ దర్శనం అయ్యింది. రావణుడిని చూశాను, రావణుడు సీతమ్మతో మాట్లాడిన మాటలు విన్నాను, త్రిజటా స్వప్నం విన్నాను. సీతమ్మని జగన్మాతగా తెలుసుకున్నాను. నేను సీతమ్మని చూశాను అన్న విషయాన్ని ఇప్పుడే వెళ్ళి రాముడికి చెప్పలేను, ఎందుకంటే అమ్మ ఇప్పుడు ఉరి పోసుకుంటోంది. నేను ఇప్పుడు సీతమ్మని ఓదార్చాలి. ఇప్పుడు నేను అమ్మని ఓదార్చి మాట్లాడకుండా వెళ్ళిపోతే, రేపుపొద్దున్న సీతమ్మ ఉరి పోసుకొని చనిపోయిందన్న విషయం రాముడికి తెలిస్తే ఆయన బాణాల చేత ఈ సమస్త బ్రహ్మాండాన్ని క్షోభింప చేస్తాడు. నేను చాలా పండితుడని అనుకున్న వివేచనాశీలత లేని మంత్రి చేత, దూత చేత కార్యాలు చెడిపోతాయి. ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి? నేను గట్టిగా మాట్లాడితే చుట్టూ ఉన్న ఈ రాక్షస స్త్రీలు నా మాటలని విని, నా మీదకి వస్తారు. అప్పుడు నాకువాళ్ళకి యుద్ధం జరుగుతుంది.

జయాపజయాలను విధి నిర్ణయిస్తుంది. కాని రాముడు లంకా పట్టణాన్ని చేరేలోపల నేను చేసిన అల్లరి చేత సీతమ్మని రావణుడు వేరొకచోటకు మార్చవచ్చు. ఇప్పుడు నేను వానర భాషలో మాట్లాడితే సీతమ్మకి ఆ బాష అర్థం కాదు. మనుష్య భాషలో మాట్లాడితే రాక్షసులు గుర్తు పడతారు. వానరరూపంలో ఉన్న నేను మనుష్య భాషలో మాట్లాడితే, ఇది కచ్చితంగా రావణ మాయే అని భయపడి సీతమ్మ ఇంకా గట్టిగా ఉరి బిగించుకుంటుంది. నా కారణంగా సీతమ్మ ప్రాణాలను విడిచిపెడితే ఆ పాపం నాకు అంటుకుంటుంది. ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి? ఏమి మాట్లాడి సీతమ్మని ఓదార్చాలి?" అని అనుకుంటూ, "సీతమ్మ ఉరి పోసుకోవడం మానేసి నా వైపు చూడాలంటే రామనామం ఒక్కటే మార్గం. సీతమ్మకి చాలా ఇష్టమైన రామ కథని చెబుతాను" అని అనుకొని హనుమంతుడు రామ కథ గానం చెయ్యసాగాడు. "పూర్వకాలం కోసల దేశాన్ని ఇక్ష్వాకు వంశంలో పుట్టిన దశరథ మహారాజు పరిపాలించేవాడు. విపరీతమైన ఐశ్వర్యాన్ని సంపాదించివాడు, ఇంద్రుడితో సమానమైనవాడు, ఇతరుల ధర్మాన్ని రక్షించే స్వభావం ఉన్నవాడైన దశరథుడు పుత్రకామేష్టి యాగం చేస్తే పెద్ద కుమారుడిగా రాముడు జన్మించాడు. ఆ దశరథుడు చేసిన ప్రతిజ్ఞ నిలబడేటట్టు చెయ్యడం కోసమని,ఆయనని సత్యవాక్యమందు నిలపడం కోసమని 14సంవత్సరాలు అరణ్యవాసం చెయ్యడానికి రాముడు వెళ్ళాడు. రాముడిని విడిచిపెట్టి ఉండలేక ఆయనని నిరంతరం అనుగమించే సోదరుడు లక్ష్మణుడు రాముడి వెనకాల వెళ్ళాడు. పతిసేవ తప్ప పరమ ధర్మమని తలిచే భార్య సీతమ్మ రాముడి వెనకాల వెళ్ళింది. అలా రాముడు లక్ష్మణుడితో, సీతమ్మతో దండకారణ్యంలో ఉండగా ఒకనాడు జనస్థానం ఉన్నారు. 14,000 మంది రాక్షసులు దాడి చేయగా రాముడు సంహరించాడు. దానిచేత కినుక చెందిన పదితలల రావణుడు మాయా జింకని ప్రవేశపెట్టి రామలక్ష్మణులు లేని సమయంలో సీతమ్మని అపహరించాడు. తదనంతరం సీతమ్మని అన్వేషిస్తూ వెళ్ళిన శ్రీరామచంద్రమూర్తి సుగ్రీవుడితో స్నేహం చేసి, వాలిని సంహరించి సుగ్రీవుడికి పట్టాభిషేకం చేశాడు. ఈనాడు సీతాన్వేషణ కోసం సుగ్రీవుడు అన్ని దిక్కులకీ వానరాలను పంపాడు. దక్షిణ దిక్కుకి వచ్చిన వానరాలలో ఒకడినైన హనుమ అనే నేను 100 యోజనాల సముద్రాన్ని దాటాను. సీతమ్మ ఎలాంటి కాంతితో, ఎలాంటి నగలతో, ఎలాంటి వస్త్రంతో ఉంటుందని రాముడు నాకు చెప్పాడో, అలాంటి సీతమ్మని ఈ శింశుపా వృక్షం మీదనుంచి ఇక్కడే కిందకి చూసి నేను ధన్యుడనయ్యాను" అని చెప్పి ఆగిపోయాడు.

ఇంతవరకూ వినపడని రామనామం వినపడేసరికి సీతమ్మ అప్రయత్నంగా తన మెడకి చుట్టుకున్న జుట్టుని విప్పేసింది. ఆ కథని విన్న ఆనందంలో పరమ సంతోషంగా సీతమ్మ శింశుపా వృక్షం వైపు చూసింది. సీతమ్మ చెవిలోకి మాత్రమే వినపడేటట్టుగా, దగ్గర దగ్గరగా వచ్చి, కాళ్ళతో కొమ్మని పట్టుకొని, చేతులతో ఆకులని పక్కకి తొలగించి, తెల్లటి వస్త్రాలను ధరించినవాడై, పింగళ వర్ణంతో, పచ్చటి నేత్రాలతో, పగడాల మూతితో రామ కథ చెబుతున్న సుగ్రీవుడి సచివుడైన హనుమ సీతమ్మకి దగ్గరగా కనబడ్డాడు. అలా ఉన్న హనుమని చూడగానే సీతమ్మ స్పృహ కోల్పోయి నేలమీద పడిపోయింది.

**యమ్వీఆర్**

# మహిళల నుంచే అన్నీ.. గౌతమ్ అదానీ భావోద్వేగం!



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ తన జీవితాన్ని ప్రభావితం చేసిన మహిళలను స్మరించుకున్నారు. ఒక మనిషి విజయానికి కేవలం అతని కృషి మాత్రమే కాదు.. అతని కుటుంబం, ముఖ్యంగా మహిళల ప్రోత్సాహం, విలువలు, ప్రేమ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. తన విజయాలకు పునాది తన కుటుంబ మహిళల నుంచే ఏర్పడిందని వెల్లడించారు.

గౌతమ్ అదానీ తన బాల్యంలో.. తన తల్లి శాంతాబెన్ అదానీ చెప్పిన కథలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా రామాయణంలోని కథలు ఆయనలో ధైర్యం, త్యాగం, బాధ్యత వంటి విలువలను నాటాయి. కేవలం 16 ఏళ్ల వయసులో ఆయన తన భవిష్యత్తు కోసం ముంబైకు వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఆయన తల్లి ఎంతో ధైర్యంతో తన కుమారుడిని తెలియని భవిష్యత్తు వైపు నడిపించింది. ఆ త్యాగం & ప్రేమను ఆయన జీవితాంతం గుర్తుంచుకుంటానని భావోద్వేగానికి లోనయ్యారు. అదానీ ఫౌండేషన్‌కు నాయకత్వం వహించడానికి దంతవైద్యంలో తన వృత్తిని విడిచిపెట్టిన తన భార్య ప్రీతి అదానీ గురించి కూడా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఫౌండేషన్ భారతదేశంలోని 22 రాష్ట్రాల్లో విద్య, ఆరోగ్యం, జీవనోపాధి వంటి రంగాల్లో పనిచేస్తూ ఒక కోటి మందికి పైగా ప్రజలకు సహాయం అందిస్తోందని తెలిపారు. తన కోడళ్లు పరిధి అదానీ & దివా అదానీలు కుటుంబంలోకి తాజా దృక్పథాలు & కొత్త శక్తిని తీసుకువచ్చారని ఆయన ప్రశంసించారు, అదే సమయంలో తన మనవరాలు తన జీవితంలోకి తెచ్చే ఆనందాన్ని గురించి కూడా పేర్కొన్నారు. పిల్లల కళ్లలో కనిపించే విశ్వాసం మరియు అమాయకత్వం జీవితం అసలు అర్థాన్ని గుర్తు చేస్తుందని చెప్పారు. మనిషి జీవితంలో పెద్ద కంపెనీలు, పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించవచ్చు. కానీ నిజమైన బలమైన పునాదులు కాంక్రీట్ లేదా ఉక్కుతో నిర్మితం కావు. మన జీవితాన్ని ప్రభావితం చేసే మనుషులతో నిర్మితమవుతాయి అని ఆయన అన్నారు.

# మరో దేశీయ మైక్రోప్రాసెసర్




సెమీకండక్టర్ రంగంలో మనదేశం గొప్ప పురోగతి సాధించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 1.0 జీహెచ్‌జీ, 64 బిట్ డ్యుయల్ కోర్ మైక్రోప్రాసెసర్‌ను ఆవిష్కరించింది. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డ్యాక్) రూపొందించిన దీని పేరు ధ్రువ్64. సురక్షిత, స్వావలంబ, భవిష్యత్ సిద్ధ ప్రాసెసర్ల రంగంలో దీన్ని గొప్ప ముందడుగుగా భావిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, వాహనాల దగ్గరి నుంచి ఉపగ్రహాలు, రక్షణ వ్యవస్థల వరకూ అన్నింటికీ మైక్రోప్రాసెసర్లు కీలకంగా మారిన ప్రస్తుత తరుణంలో ఇలాంటి పరిజ్ఞానం వ్యూహాత్మకంగా తప్పనిసరి అవసరమైంది. అత్యాధునిక ఫీచర్లతో తీర్చిదిద్దిన ధ్రువ్64 అత్యంత సమర్థంగా పనిచేస్తుంది. ఒకేసారి రకరకాల పనుల నిర్వహణ, విశ్వసనీయత మెరుగుపడటానికి తోడ్పడుతుంది. మనదేశం రూపొందించిన చిప్‌లలో ఇది మూడోది. మరో రెండు అభివృద్ధి దశలో ఉన్నాయి.

# గొంతుకు తేనె హాయి

గొంతునొప్పి, గరగరతో బాధపడుతున్నారా? అయితే తేనె తాగి చూడండి. గొంతు సమస్యల కోసం ప్రాచీనకాలం నుంచీ చిట్కా వైద్యంగా దీన్ని వాడుతూ వస్తున్నారు. ఇదెలా పనిచేస్తుందో శాస్త్రీయంగానూ రుజువైంది కూడా. తేనెలో సహజ చక్కెర ఉంటుంది. ఇది నోటిని తీపి చేయటమే కాకుండా గొంతునొప్పి, జలుబు, ఫ్లూ లక్షణాలు తగ్గటానికి తోడ్పడుతుండటం ఆశ్చర్యకరం. దీనికి కారణం తేనెటీగలు పువ్వుల నుంచి సేకరించిన మకరందమే. ఇందులో చక్కెర మాత్రమే కాదు.. తక్కువ మోతాదులో ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజ లవణాల వంటివీ ఉంటాయి. తేనెను తీసుకున్నప్పుడు ఇవీ ఒంట్లోకి చేరతాయి. ఇదెలా పనిచేస్తుందంటే..వాపు తగ్గుముఖం: తేనెలో రుచికారకాలు (ఫ్లేవనాయిడ్లు) ఉంటాయి. ఇవి ఒకరకం వృక్ష రసాయనాలు. వీటిల్లో వాపును తగ్గించే గుణాలుంటాయి. అందువల్ల గొంతునొప్పి ఉన్నప్పుడు కొద్దిగా తేనె తీసుకుంటే వాపు తగ్గి, కాస్త ఉపశమనం కలుగుతుంది. సూక్ష్మక్రిములతో పోరాటం: తేనెలోని ఫ్లేవనాయిడ్లకు బ్యాక్టీరియా, వైరస్ భరతం పట్టే గుణమూ ఉంది. ఇవి రోగనిరోధకశక్తికి దన్నుగా నిలిచి హానికారకాలతో పోరాడటానికి తోడ్పడతాయి. అలాగని ఇది మందులకు ప్రత్యామ్నాయం కాదు. గొంతునొప్పి మరీ ఎక్కువగా వేధిస్తుంటే తగు చికిత్స తీసుకోవాల్సిందే. గొంతు సాఫీగా: తేనె చిక్కగా, జిగురుగా ఉంటుంది. ఇది గొంతు లోపలి పొర మీద పూతలా పరచుకొని రక్షణగా నిలుస్తుంది. ఫలితంగా చిరాకు, గరగర తగ్గుతాయి. తేలికగా మింగటానికి తోడ్పడుతుంది. దగ్గు నుంచి ఉపశమనం: గొంతుకు హాయినిచ్చే గుణాలు దగ్గు



తగ్గటానికీ సాయం చేస్తాయి. దుకాణాల్లో అమ్మే దగ్గు మందుల కన్నా తేనె మరింత ఎక్కువ సమర్థంగా పనిచేస్తున్నట్టు.. ముఖ్యంగా రాత్రిపూట వేధించే దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఎలా తీసుకోవాలి? ఒకట్రెండు చెంచాల తేనె నేరుగా తీసుకోవచ్చు. గోరువెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి అయినా తీసుకోవచ్చు. గ్రీన్ టీ, పుదీనా టీ వంటి వాటిల్లోనైనా కలిపి తాగొచ్చు.

# చెవి గులిమి తీయాల్సిందేనా?


గులిమి తీస్తేనే చెవులు శుభ్రంగా ఉంటాయని కొందరు భావిస్తుంటారు. ఇది నిజం కాదు. చాలామందికి దానంతటదే బయటకు వస్తుంది. చెవి మార్గంలోని ప్రత్యేక చర్మం గులిమిని బయటకు తోస్తూ, ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంది. అందువల్ల తీయాల్సిన పనిలేదు. చెవి మార్గం ముందుభాగంలోని వెంట్రుకలు, సెబేషియస్ గ్రంథుల నుంచి వెలువడే స్రావాలతో గులిమి తయారవుతుంది. ఇది లోపలి భాగాన్ని తడిగా ఉంచుతూ, మార్గం ఎండిపోకుండా చూస్తుంది. దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా, క్రిముల వంటివి లోనికి వెళ్లకుండా అడ్డుకుంటుంది. మృతకణాలు, వ్యర్థాలను తనలో కలిపేసుకుంటుంది. అంటే చెవికి సహజ రక్షణ కవచంగా నిలుస్తుందన్నమాట. కొందరికిది ఎక్కువగా తయారవ్వచ్చు. కొందరికిది చాలా జిగురుగా, మరికొందరికి గట్టిగానూ ఉండొచ్చు. ఏదేమైనా దీన్ని ప్రత్యేకించి తీయాల్సిన అవసరం లేదు. అగ్గిపుల్లలు, పిన్నీసులు, కాటన్ బడ్స్ వంటివి చెవిలో పెట్టి తిప్పితే గులిమి ఇంకా లోపలికి పోయే ప్రమాదముంది. చెవిలోని చర్మం, కర్ణభేరి దెబ్బతినొచ్చు. చెవి ఇన్‌ఫెక్షన్ కూడా తలెత్తొచ్చు. చాలాతక్కువ (5%) మందిలో గులిమి లోపల పోగవ్వచ్చు. వీరిలో 1-2% మందికి గట్టి పడి, చెవి మార్గం నిండిపోవచ్చు. ఇలాంటివారికే గులిమి తీయాల్సి వస్తుంది. అదీ ఈఎన్‌టీ నిపుణులతోనే తీయించుకోవాలి. వీరికి ముందుగా వారం పాటు రోజుకు మూడు సార్ల చొప్పున చెవిలో చుక్కల మందు లేదా గోరువెచ్చగా చేసి చల్లార్చిన ఆలివ్ నూనె వంటివి వేస్తారు. గులిమి మెత్తబడ్డాక



మైక్రోస్కోపిక్ వ్యాక్యూమ్ సక్షన్‌తో జాగ్రత్తగా బయటకు తీస్తారు. కొన్నిచోట్ల చెవిలోకి సిరంజితో నీటిని బలంగా పంపించి, గులిమి బయటకు వచ్చేలా చేస్తుంటారు. ఇది సురక్షితం కాదు. దీంతో కొన్నిసార్లు కర్ణభేరి దెబ్బతినొచ్చు. అప్పటికే కర్ణభేరికి రంధ్రం ఉన్నట్టయితే హానికారకాలు లోపలి చెవికి చేరుకొని ఇన్‌ఫెక్షన్, నొప్పి, చీము కారటం వంటివి తలెత్తే ప్రమాదమూ ఉంటుంది.

# గుండెకూ మెట్‌ఫార్మిన్ మేలు

మధుమేహానికి వాడే మెట్‌ఫార్మిన్ మందు గుండె వేగంగా కొట్టుకునే (ఏట్రియల్ ఫిబ్రిలేషన్) సమస్య తిరగబెట్టకుండా చూడటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. సాధారణంగా విద్యుత్ ప్రచోదనాలు అస్తవ్యస్తం కావటం వల్ల గుండె లయ తప్పి, వేగంగా కొట్టుకుంటుంది. వీరికి గుండె కణజాలంలో కొంత భాగాన్ని కాల్చితే (అబ్లేషన్) అసాధారణ సంకేతాలు పుట్టటం ఆగుతుంది. ఈ చికిత్స చేయించుకున్నవారికి మెట్‌ఫార్మిన్ సాయం చేస్తున్నట్టు ఇటీవల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సదస్సులో సమర్పించిన అధ్యయనం చెబుతోంది. ఇందులో భాగంగా ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌కు అబ్లేషన్ చికిత్స చేయించుకున్న అధిక బరువు, ఊబకాయులను నిశితంగా పరిశీలించారు. వీరెవరికీ మధుమేహం లేదు గానీ 40% మంది ముందస్తు మధుమేహ దశలో ఉన్నారు. వీరిలో మెట్‌ఫార్మిన్ తీసుకున్నవారికి గుండె వేగంగా కొట్టుకునే సమస్య తిరగబెట్టటం తక్కువగా ఉంటున్నట్టు తేలటం గమనార్హం. తమ శరీర బరువులో 10% తగ్గినా ఏట్రియల్ ఫిబ్రిలేషన్ తిరగబెట్టే ముప్పు 6 రెట్లు తక్కువగా ఉంటున్నట్టు గత అధ్యయనాలు



చెబుతున్నాయి. అయితే మెట్‌ఫార్మిన్ తీసుకున్నవారు పెద్దగా బరువేమీ తగ్గలేదు. అయినా మంచి ఫలితం కనిపించటం విశేషం. జీవక్రియను ఉత్తేజితం చేయటం.. వాపుప్రక్రియను, గుండెచుట్టూ ఉండే కొవ్వును తగ్గించటం ద్వారా మెట్‌ఫార్మిన్ మేలు చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

# మీరే మూలకణ దాతలు



రక్తదానం, కిడ్నీ దానం, కాలేయ దానం గురించి తెలిసిందే. మరి మూలకణ దానం గురించి? రక్త క్యాన్సర్లు, థలసీమియా వంటి జబ్బులతో జీవన్మరణాల మధ్య కొట్టు మిట్టాడుతున్న ఎంతోమందికిది పునర్జన్మ ప్రసాదిస్తోంది. నిజానికిది కొత్తదేమీ కాదు. కాకపోతే ఇప్పుడిప్పుడే బాగా ప్రాచుర్యం పొందుతోంది. స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు, దాతలు చొరవచూపటం, ప్రచారం చేస్తుండటంతో రోజురోజుకీ ఊపందుకుంటోంది. విశాఖపట్నానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రెండుసార్లు మూలకణాలను దానం చేసి, రక్తక్యాన్సర్‌తో బాధపడుతున్న ఇద్దరికి పునర్జన్మ ప్రసాదించారు. తీవ్ర అప్లాస్టిక్ ఎనీమియాతో బాధపడుతున్న 11 ఏళ్ల తన సోదరుడికి పదేళ్ల వరంగల్ అమ్మాయి మూలకణాలను దానం చేసి జబ్బు నుంచి బయటపడేలా చేసింది. మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక అమ్మాయి తన నాలుగేళ్ల సోదరుడికి మూలకణాలను దానం చేసి సోదర ప్రేమను చాటుకుంది. పదేళ్ల బాలుడి ప్రాణాలు కాపాడటానికి ఒక వ్యక్తి ఎక్కడో ఉన్న దుబాయి నుంచి ఇక్కడి కేరళకు వచ్చి మూలకణాలను దానం చేశారు. ఇవన్నీ ఇటీవల వెలుగులోకి వచ్చిన ఉదంతాలే. రోజురోజుకీ మూలకణ దానం ప్రాచుర్యం పొందుతోందనటానికి నిదర్శనాలే. మృత్యుముఖంలో నిల్చున్నవారి ప్రాణాలను కాపాడటంలో మూలకణాల ప్రాధాన్యాన్ని గుర్తిస్తుండటం, అవగాహన పెరుగుతుండటం ఈ ధోరణిని ప్రోత్సహిస్తోంది. మూలకణాలను సేకరించే ప్రక్రియ సులభతరం కావటం, దీంతో ముడిపడిన దుష్ప్రభావాలు తగ్గటం.. మూలకణ దాతల పేర్లను నమోదు చేసుకునే రిజిస్ట్రీల్లో మరింత ఎక్కువమంది చేరుతుండటమూ కలిసి వస్తోంది. ఇప్పుడిప్పుడే పరిస్థితి ఆశాజనకంగా మారుతున్న మాట నిజమే అయినా మూలకణ దానంపై ఇప్పటికీ ప్రజల్లో సరైన అవగాహన లేకపోవటం, అపోహలు అడ్డంకులుగా నిలుస్తున్నాయి.

**ఏంటీ మూలకణాలు?**

ఇవి ప్రత్యేకమైన, శక్తిమంతమైన కణాలు. ఒకటి రెండుగా విభజన చెందటం, ఎలాంటి కణజాలంగానైనా మారటం వీటి ప్రత్యేకత. ఒక మూలకణం రెండుగా విభజన చెందినప్పుడు వీటిల్లో ఒకటి అవయవ కణంగా మారితే.. మరొకటి మూలకణంగా మిగులుతుంది. అవసరమైతే తిరిగి విభజన చెందుతుంది కూడా. ఇలా కణజాలాలు ఆరోగ్యంగా ఉండటానికి, మరమ్మతు కావటానికివి తోడ్పడతాయి. దెబ్బతిన్న కణాలు, అస్తవ్యస్తమైన కణాలు తిరిగి కోలుకోవటానికి దోహదం చేస్తాయి.

**ఎలా పనిచేస్తాయి?**

దెబ్బతిన్న లేదా మృతకణాలు వాటికి సంబంధించిన కణ ఆకృతులను (డ్యాంప్స్) విడుదల చేస్తాయి. ఇవే 'ప్రమాద' సంకేతాలుగా మూలకణాలకు దారిచూపుతాయి. వీటికి మూలకణాల మీదుండే గ్రాహకాలు అంటుకొని ప్రాథమిక వాపు ప్రతిస్పందనను ప్రేరేపిస్తాయి. అప్పుడు మూలకణాలు ఉత్తేజితమై గ్రోత్ ఫ్యాక్టర్స్, సైటోకైన్ల వంటి వాటిని విడుదల చేసి పనిలోకి దిగుతాయి. వేగంగా విభజన చెందుతూ, ఆయా కణజాలాలకు చెందిన కొత్త కణాలుగా మారతాయి. దెబ్బతిన్న కణాల స్థానంలో కుదురుకొని, మరమ్మతు ప్రక్రియను చేపడతాయి. అందుకే రక్త క్యాన్సర్లు, థలసీమియా, తీవ్ర అప్లాస్టిక్ ఎనీమియా వంటి రక్త సమస్యల చికిత్సల్లో ఆశాజనకంగా కనిపిస్తున్నాయి.

**దాతల కొరతే అడ్డంకి**

మూలకణ మార్పిడిలో రోగి జన్యు మ్యాపింగ్ (హెచ్‌ఎల్‌ఏ టైప్) దాతలతో సరిపోవటం చాలా కీలకం. అప్పుడే చికిత్స విజయవంతంగా పనిచేస్తుంది. అయితే రోగి కుటుంబ సభ్యుల్లో సరిపోయిన దాతలు దొరకటం కష్టం. కేవలం 25% మంది జన్యు మ్యాపింగ్ మాత్రమే సరిపోతుంది. మనదేశంలో సుమారు లక్షకు పైగా థలసీమియా బాధితులున్నారని అంచనా. ఏటా కొత్తగా సుమారు 10వేల కొత్త కేసులు నమోదవుతున్నాయి కూడా. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 27 సెకండ్లకు ఒకరు రక్తక్యాన్సర్ బారినపడుతున్నారు. వీరిలో 17% మందికే సరిపోయిన దాతలు దొరుకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే దాతల మూలకణాలకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఈ విషయంలో ఎముకమజ్జ, మూలకణ దాతల రిజిస్ట్రీలు ఆదుకుంటున్నాయి. మనదగ్గర ధాత్రి, డీకేఎంఎస్ వంటి రిజిస్ట్రీలు చురుకుగా ఉన్నాయి. ఇవి స్థానిక ఆసుపత్రులు, వైద్యసంస్థల సహకారంతో స్వచ్ఛందంగా పనిచేస్తున్నాయి. దాతలకు, రోగులకు సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నాయి.

**అపోహలు వద్దు**


మూల కణాలను దానం చేయటం సురక్షితం. శరీరం మీద ఎలాంటి దుష్ప్రభావమూ పడదు. కానీ కొన్ని అపోహలు వెనకాడేలా చేస్తున్నాయి. రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నవారిలోనూ మరింత సమాచారం ఇవ్వటానికి నిరాకరిస్తుండటం గమనార్హం. దాతలుగా నమోదు చేసుకున్నవారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. వీళ్లు మూల కణాల దానం చేస్తామని కుటుంబ సభ్యులకు చెప్పినప్పుడు అభ్యంతరం చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం మూల కణాల మీద, వీటి దానం మీద అవగాహన లేకపోవటమే. ఒకప్పుడు బైపాస్ సర్జరీ చేయించుకున్నవారి సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టేవారు. ఇప్పుడు కాస్త పెద్ద పట్టణాల్లోనూ చేసేస్తున్నారు. భవిష్యత్తులో మూలకణ మార్పిడి సైతం ఇలాంటి స్థితికి చేరుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ప్రమాణాలు పెరుగుతున్నకొద్దీ ఫలితాలూ మెరుగవుతాయని.. దీంతో ప్రజలూ బాగా అంగీకరిస్తారని నిపుణులు ఆశిస్తున్నారు.

**ఆరోగ్యవంతులెవరైనా.**

మంచి ఆరోగ్యంతో ఉన్న 18-50 ఏళ్ల వయసువారు ఎవరైనా మూలకణాలను దానం చేయొచ్చు. వీటిని దానం చేయాలనే ఆసక్తి గలవారు రిజిస్ట్రీల వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొన్ని తేలికైన ప్రశ్నలకు సమాధానాలిస్తే దూదిపుల్ల పరీక్ష (స్వాబ్) కిట్‌ను పంపిస్తారు. దీన్ని నోట్లో బుగ్గల మీద రుద్ది, ప్యాక్ చేసి తిరిగి వెనక్కి పంపించాలి. ఇందులో ఎలాంటి నొప్పి ఉండదు. రక్తస్రావమేమీ కాదు. దూదిపుల్లకు అంటిన జిగురుపొర కణాలను విశ్లేషించి, హెచ్‌ఎల్‌ఐ టైపింగ్‌ను నిర్ణయిస్తారు. అనంతరం నమోదు చేసుకున్న వ్యక్తికి సర్టిఫికెట్ అందజేస్తారు. దీనిలోని బార్‌కోడ్‌లో దాతకు సంబంధించిన వివరాలన్నీ ఉంటాయి. హెచ్‌ఎల్‌ఏ టైపింగ్ రోగితో సరిపోతే రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న వ్యక్తిని సంప్రదిస్తారు. కొన్ని ముందస్తు పరీక్షలు నిర్వహించి ఇన్‌ఫెక్షన్లు, రక్త సమస్యల వంటివేవైనా ఉన్నాయేమో చూస్తారు. ఆరోగ్యంగా ఉన్నట్టు తేలితే మూలకణాలను తీసుకుంటారు. దానం ఎలా? ఒకప్పుడు ఎముకమజ్జను తీసి దానిలోంచి మూలకణాలను సేకరించేవారు. ఇది కాస్త నొప్పితో కూడుకున్న ప్రక్రియ. అందుకే చాలమంది భయపడేవారు. ముఖ్యంగా కుటుంబసభ్యులు కానివారికి ఎముకమజ్జ ఇవ్వటానికి వెనకాడేవారు. ఇప్పుడలాంటి ఇబ్బందేమీ లేదు. కాళ్లు, చేతుల్లోని రక్తనాళాల నుంచి తీసిన రక్తం ద్వారానే మూలకణాలను తీసుకునే విధానం (పెరిఫెరల్ బ్లడ్ స్టెమ్‌సెల్ డొనేషన్) వచ్చింది. ముందుగా దాతకు ఐదురోజుల పాటు గ్రాన్యులోసైట్ కాలనీ స్టిమ్యులేటింగ్ ఫ్యాక్టర్ (జీసీఎఫ్) ఇంజెక్షన్ ఇస్తారు. దీంతో మూలకణాల సంఖ్య బాగా పెరుగుతుంది. అవి ఎముకమజ్జలోంచి బయటకు వచ్చి రక్తంలోకి చేరతాయి. ఐదో రోజున కాళ్లు, చేతుల్లోని రక్తనాళాల ద్వారా మూలకణాలను సంగ్రహిస్తారు. రక్తాన్ని సేకరించేటప్పుడే ఎఫెరిసిస్ యంత్రం ద్వారా వీటిని వేరు చేస్తారు. మిగతా రక్తమంతా తిరిగి దాత శరీరంలోకే వెళ్తుంది. ఇదంతా నాలుగైదు గంటల్లోనే ముగుస్తుంది. సేకరించిన మూలకణాలను భద్రపరుస్తారు. అవసరమైన రోగికి ఎక్కిస్తారు. కుటుంబ సభ్యులు, బంధువులైతే తప్ప ఎవరు, ఎవరికి మూలకణాలను దానం చేస్తున్నారో తెలిసే అవకాశం లేదు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పుడో, మరో సందర్భంలోనో దాతలు, గ్రహీతలు కలుసుకునే అవకాశముంటుంది. అదీ వాళ్లు అంగీకరిస్తేనే. రిజిస్ట్రీలు ప్రపంచవ్యాప్తంగానూ సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటాయి. అంటే హెచ్‌ఎల్‌ఏ టైపింగ్ సరిపోతే ప్రపంచంలో ఎక్కడ, ఎవరికి అవసరమైనా మూలకణాలు దానం చేసే సదవకాశం లభిస్తుందన్నమాట.

**రెండు రకాల మూలకణాలు**తల్లిదండ్రుల అండం, శుక్ర కణాల కలయికతో ఏర్పడిన ఒక్క మూలకణం నుంచి 40 ట్రిలియన్ల కణాలు పుట్టుకొస్తాయి. వీటితోనే శరీరమంతా ఏర్పడుతుంది. మూలకణం శక్తి అలాంటిది. అయితే దాతల మూలకణాలు రోగుల్లో చాలామందికి సరిపోవు. దాతల సంఖ్య పెరిగితే సరిపోయే మూలకణాలు అందుబాటులో ఉండటమూ ఎక్కువవుతుంది. ఈ నేపథ్యంలో మూలకణ దానం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశమంతటా ప్రాచుర్యం పొందుతుండటం ముదావహం. అయితే రక్తం నుంచి సేకరించిన మూలకణాలను (హీమోపోయెటిక్ స్టెమ్ సెల్స్) కొన్నిసార్లు శరీరం తిరస్కరించొచ్చు (గ్రాఫ్ట్ వర్సెస్ హోస్ట్ డిసీజ్). దీన్ని నివారించటానికి స్టిరాయిడ్లు, కొత్తరకం మందులు తోడ్పడతాయి. ఇవీ పనిచేయకపోతే? మీసెన్‌కైమల్ స్టెమ్ సెల్స్ అనే మరోరకం మూలకణాలు ఆదుకుంటాయి. ఎముకమజ్జ, కొవ్వు, బొడ్డుతాడు రక్తం నుంచి వీటిని సేకరించాల్సి ఉంటుంది. కణజాలాలను మరమ్మతు చేయటం వీటి ప్రత్యేకత. అందుకే ఇవి మధుమేహం, గుండె, కిడ్నీ వైఫల్యం, అల్జీమర్స్, కీళ్ల నొప్పుల వంటి సమస్యల చికిత్సలో ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఒకరకంగా ఇవి ఆయా అవయవాలను పునరుత్తేజితం (రీజనరేటివ్) చేసి, జబ్బులను సమూలంగా నయం చేస్తాయన్నమాట. అయితే వీటికి మనదేశంలో మరో రెండు మూడేళ్లలో అనుమతి లభించొచ్చు. ఈ మూలకణాల విషయంలో ప్రపంచంలోనే మనదేశం ముందుండటం గమనార్హం.

# వాట్సప్‌లో గ్రూప్ మెసేజ్ హిస్టరీ




వాట్సప్ కొత్తగా గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్‌ను తీసుకొస్తోంది. కొత్త సభ్యులకు స్వాగతం పలకటానికిది ఎంతో అనువుగా ఉంటుంది. దీంతో అడ్మిన్లు, గ్రూప్ సభ్యులు కొత్తవారికి ఇటీవలి మెసేజ్‌లను షేర్ చేయొచ్చు. అప్పుడు నడుస్తున్న చర్చల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పాల్గొనొచ్చు. అన్ని వాట్సప్ మెసేజ్‌ల మాదిరిగానే గ్రూప్ మెసేజ్ హిస్టరీ కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయ్యి ఉంటాయి. అందువల్ల కన్వర్జేషన్లు రహస్యంగానే ఉంటాయి. స్క్రీన్‌షాట్ల మీద ఆధారపడటం, మాన్యువల్‌గా మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయటం వంటి ఇబ్బందులేవీ ఉండవు. గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్ సాయంతో అడ్మిన్లు, సభ్యులు 25 నుంచి 100 వరకూ ఇటీవలి మెసేజ్‌లను ఎంచుకొని, పంపటానికి వీలుంటుంది. వీటి ద్వారా కొత్త సభ్యులు సమంజసమైన సందర్భం తెలుసుకోవచ్చు. ఒకవేళ అడ్మిన్లు వద్దనుకుంటే ఈ ఫీచర్‌ను డిసేబుల్ చేసే అవకాశమూ ఉంటుంది. అయినా కూడా అడ్మిన్లు ఎప్పుడైనా తమంతతాము మెసేజ్ హిస్టరీని షేర్ చేయొచ్చు. మెసేజ్ హిస్టరీని షేర్ చేసినప్పుడు బృంద సభ్యులందరికీ దానికి సంబంధించిన నోటిఫికేషన్ అందుతుంది. ఇది పారదర్శకతకు తావిస్తుంది.

# స్లీప్ అప్నియాతో ఎన్నో సమస్యలు



స్లీప్ అప్నియా.. రక్తనాళాల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందట. గురక, నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోవడం వల్ల.. వాస్కులర్ ఏజింగ్ సమస్య వచ్చే అవకాశం కూడా ఉన్నదట. తాజాగా, 20 దేశాలలోని 29,653 మంది పెద్దల డేటాను విశ్లేషించిన పరిశోధకులు.. ఈ విషయాన్ని బయటపెట్టారు. స్లీప్ అప్నియా.. రక్తనాళాల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందట. గురక, నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోవడం వల్ల.. వాస్కులర్ ఏజింగ్ సమస్య వచ్చే అవకాశం కూడా ఉన్నదట. తాజాగా, 20 దేశాలలోని 29,653 మంది పెద్దల డేటాను విశ్లేషించిన పరిశోధకులు.. ఈ విషయాన్ని బయటపెట్టారు. స్లీప్ అప్నియా-వాస్కులర్ ఏజింగ్ మధ్యగల సంబంధం గురించిన వివరాలను వెల్లడించారు. నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోవడం వల్ల శరీరంలో కొన్ని ప్రతికూల మార్పులు జరుగుతాయట. రక్తంలో ఆక్సిజన్ స్థాయులు అకస్మాత్తుగా పడిపోవడం, పెరగడం వల్ల 'ఆక్సిడేటివ్ స్ట్రెస్' పెరుగుతుంది. ఇది రక్తనాళాల లోపలి పొరను దెబ్బతీస్తుంది. ఇక శ్వాస ఆగిపోయిన ప్రతిసారీ రక్తపోటు అకస్మాత్తుగా ఎక్కువ అవుతుంది. దీనివల్ల రక్తనాళాల గోడలు గట్టిగా మారుతాయి. అంతేకాకుండా, స్లీప్ అప్నియా వల్ల శరీరంలో సీ-రియాక్టివ్ ప్రొటీన్ లాంటి ఇన్‌ఫ్లమేటరీ కారకాలు పెరుగుతాయి. ఇవి రక్తనాళాల వృద్ధాప్యానికి దారితీస్తాయి. దీర్ఘకాలంలో, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అవి మూసుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా, రక్తనాళాల పనితీరు తగ్గి.. గుండె జబ్బులు వచ్చే అవకాశం పెరుగుతుంది. మెదడుకు వెళ్లే రక్తనాళాలు దెబ్బతినడం వల్ల ఆలోచనా శక్తిపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి, వాస్కులర్ ఏజింగ్‌ను అరికట్టడానికి స్లీప్ అప్నియా నుంచి బయటపడాలని నిపుణులు సూచిస్తున్నారు. బరువు తగ్గడం వల్ల స్లీప్ అప్నియా తీవ్రత గణనీయంగా తగ్గుతుందట, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తనాళాల స్థితిస్థాపకత పెరుగుతుంది. యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవడం ద్వారా.. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించవచ్చు. తద్వారా రక్తపోటు, గుండెపోటు లాంటి సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

# ట్రాయ్ మైస్పీడ్

మొబైల్ ఇంటర్నెట్ వేగం, నెట్‌వర్క్ నాణ్యతను కొలిచే యాప్ ఇది. ఫోన్ నెట్‌వర్క్‌కు సిగ్నల్ కవరేజ్, డేటా స్పీడ్ (డౌన్‌లోడ్/అప్‌లోడ్) పరీక్షించటానికి తోడ్పడుతుంది. వేగం, నాణ్యతలో ఏదైనా తేడా ఉంటే ట్రాయ్‌కు సమాచారాన్ని చేరవేస్తుంది. ఇది సేవలు మెరుగుపడటానికి తోడ్పడుతుంది. మొబైల్ డేటా నెమ్మదించటం, నెట్‌వర్క్ సమస్యలను ట్రాయ్‌కు, సర్వీస్ ప్రొవైడర్లకు తెలియజేయొచ్చు. వీటి పరిష్కారానికిది బాగా ఉపయోగపడుతుంది.



# గోదావరి జిల్లాల సమాచారం

## తాళం వేసిన ఇళ్లే టార్గెట్

**అమలాపురం టౌన్:** ముందు రెక్కీ నిర్వహిస్తారు.. తాళం వేసిన ఇళ్లను గమనిస్తారు.. రాత్రి పూట ఆ ఇళ్లకు వెళ్లి తాళాలు బద్దలుకొట్టి చోరీలకు పాల్పడతారు. ఇలా ఆలమూరు మండలం పేనికేరు గ్రామంలో గత నెల 14న రాత్రి ఓ ఇంట్లో జరిగిన చోరీపై తీగ లాగితే డొంక కదిలినట్లు ఈ దొంగల ముఠా బండారం బయట పడింది. చోరీలు చేస్తున్న ఆ ముగ్గురూ 22 ఏళ్ల లోపు యువకులే. ఇందులో ఆలమూరు మండలం పెద్ద పళ్ల గ్రామానికి చెందిన కంచెర్ల జార్జ్ బెన్నీ, సన్నపు శ్రీచరణ్, కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన ఉందుర్తి ఆనంద్‌కుమార్‌లను సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 32.40 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ రాహుల్ మీనా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐలు, ఎస్సైలతో కలసి అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆ వివరాల ప్రకారం.. ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో తాజాగా జరిగిన రెండు చోరీ కేసుల్లో పైముగ్గురు నిందితులు. కంచెర్ల జార్జిబెన్నీపై గతంలో ఆలమూరు, రావులపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనం, గంజాయి కేసులు ఉన్నాయి. ఉందుర్తి ఆనంద్‌కుమార్‌పై గతంలో ఆలమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసు ఉంది. ఈ చోరీ కేసులను ఛేదించిన పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్‌తో పాటు రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, అమలాపురం సీసీఎస్ సీఐ ఎం.గజేంద్రకుమార్, క్లూస్ టీమ్ సీఐ కె.ప్రవీణ్‌కుమార్, ఆలమూరు ఎస్సై జి.నరేష్, సీసీఎస్ ఎస్సైలు ఎ.పరదేశి, అయితాబత్తుల బాలకృష్ణ, సీసీఐ ఏఎస్సై రాజు తదితరులను ఎస్పీ ప్రశంసించారు. అనంతరం వారికి నగదు రివార్డులను అందించారు. ఎవరైనా ఇంటికి తాళాలు వేసి వేరే ఊళ్లకు వెళితే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మీనా విజ్ఞప్తి చేశారు.

## అనిశా సోదాలతో ఉలికిపడిన యంత్రాంగం



**రాజమహేంద్రవరం :** నల్లమందు సందులో జీ ప్లస్ 2 నిర్మాణానికి అనుమతులు తీసుకోగా, అదనంగా మరో ఫ్లోర్ నిర్మాణ అనుమతులకు రూ. 5 లక్షలు సిబ్బందికి చెల్లించాల్సి వచ్చింది. ఇక్కడ సెల్లార్లను కమర్షియల్‌గా వినియోగించుకుంటున్నారు. తిలక్ రోడ్డులో వాణిజ్య భవన నిర్మాణం, అదనపు అంతస్తుల నిర్మాణ అనుమతులకు రూ 10 లక్షలకు బేరం జరిగింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రణాళిక అక్రమాలకు కేంద్రంగా మారింది. ఈ విభాగం పని తీరుపై కొన్నేళ్లుగా విమర్శలు వెల్లువెత్తుతునే ఉన్నాయి. సామాన్యుడు ఇంటి బయట చిన్న రేకుల షెడ్డు నిర్మిస్తే దాడులు నిర్వహిస్తున్న యంత్రాంగం అనధికారంగా నిర్మిస్తున్న పెద్ద భవంతుల వైపు కన్నెత్తి చూడటం లేదు. కాసులిస్తే చాలు.. ఎంత పెద్ద భవనమైనా నిబంధనలతో పని లేకుండా నిర్మించవచ్చన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా అనిశా దాడుల ద్వారా అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణ చేయడంతోపాటు, కూటమి అధికారంలో వచ్చాక ఎన్ని దరఖాస్తులు అందాయి , వాటిని ఎంత వరకూ పరిష్కరించారు అనే అంశాలను అనిశా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ అకస్మిక దాడులతో యంత్రాంగం ఒక్కసారిగా ఉలికిపడింది.

**ఇరుకు రోడ్లు.. సెల్లార్లు లేని భవంతులు**

ప్రతి రోజూ లక్ష మంది వరకు వివిధ పనుల నిమిత్తం నగరానికి వస్తుంటారు. కొన్ని చోట్ల 15 నుంచి 20 అడుగుల రోడ్లు మాత్రమే ఉన్నాయి. కనీసం ప్రమాదం జరిగితే అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి. వ్యాపార కేంద్రం కావడంతో సెల్లార్లు లేకుండానే అనుమతులు మంజూరు చేసేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెల్లార్లు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించిన 1200 భవనాలను గుర్తించారు. వాటిలో చాలా వరకూ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. యథేచ్ఛగా వాణిజ్య సముదాయాల నిర్మాణాలు

కొత్త బృహత్తర ప్రణాళిక 2017లోనే రూపొందించిన కార్యరూపం మాత్రం దాల్చలేదు. అఖండ గోదావరి తీరం ఉన్న నగరంలో వాణిజ్యపరంగా ప్రత్యేకత చాటుతోంది. మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, తాడితోట, దేవీచౌక్, కంబాలచెరువు, తిలక్ రోడ్డు, ఏవీఏ రోడ్డు, దానవాయిపేట, ప్రకాశంనగర్ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఈ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొన్ని భవనాలు ఏ మాత్రం నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు.

**బాధ్యులపై చర్యలు శూన్యం**

నగరంలో సెల్లార్లు లేకుండా అనుమతులు ఇచ్చిన వాటిలో 680 వరకూ గుర్తించారు. వీటిపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో అప్పటి రాజకీయ నేతలను అడ్డం పెట్టుకొని అధికారులు ఇష్టానుసారంగా వ్యవహారాలు సాగించారు. అనిశా అధికారులు గత అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. ఫిర్యాదుల మేరకు విచారణ చేస్తున్నారు.

## కాలం చెల్లిన శీతలపానీయాలు విక్రయాలు



**అన్నవరం :** అన్నవరం కొండపై కొందరు ప్రైవేటు వ్యాపారులు భక్తుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కాలం చెల్లిన శీతలపానీయాలు విక్రయిస్తున్నారు. పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ సహాయ ఆహార నియంత్రణాధికారి నందాజీ, ఆహార భద్రతా అధికారి ప్రసాద్‌లు పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఉన్న వేలంపాటలు ద్వారా హక్కులు దక్కించుకున్న ఓ ఫ్యాన్సీ దుకాణంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు 125కు పైగా వివిధ కంపెనీలకు చెందిన శీతలపానీయాల సీసాలు కాలం చెల్లినవి ఉన్నట్లు గుర్తించారు. వీటిని దర్జాగా ఫ్రిజ్‌లో పెట్టి మరీ విక్రయిస్తున్నారు. వీటి విలువ సుమారు రూ.2,700గా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సీసాలను సీజ్ చేశారు. దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయానికి ఆహార లైసెన్స్ ఉండాలి. కానీ దుకాణానికి ఎటువంటి లైసెన్స్ లేకపోవడంతో నోటీసు ఇచ్చారు. ఎక్కడా ధరల పట్టికలు తెలిపే బోర్డులు ఉండవు. పర్యవేక్షణ ఉండదు. దీంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు హడావుడి చేసి బోర్డులు పెట్టి తర్వాత పట్టించుకోవడం లేదు. బోర్డులు ఉన్నా అవి భక్తులకు మాత్రం కనిపించని విధంగా ఉంటాయి. కొండ దిగువున ఓ కిరాణా దుకాణంలో ప్లాస్టిక్ బియ్యం అమ్ముతున్నారని ఫిర్యాదుతో ఆ దుకాణంలో విక్రయిస్తున్న బియ్యం నమూనాలు సేకరించారు. పరీక్షకు పంపిస్తున్నామని ఫలితాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని నందాజీ తెలిపారు.

## బండి పోతే కాదు.. దొరికితేనే కేసు

గతేడాది ఏప్రిల్‌లో కాకినాడ డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో ఓ ఉద్యోగి తన ద్విచక్ర వాహనాన్ని పార్కుచేసి విధులకు వెళ్లాడు. పని ముగించుకుని వచ్చి చూడగా ఎవరో ఆ వాహనాన్ని చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఏడు నెలల తర్వాత డిసెంబర్ 3న కేసు నమోదు చేశారు.



కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన వ్యక్తి గత నెల 11న రాత్రి ఇంటి బయట ద్విచక్ర వాహనం పార్కు చేశారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి కనిపించలేదు. ఫిర్యాదు చేసిన దాదాపు 20 రోజుల తర్వాత ఇటీవల పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లాలో ద్విచక్ర వాహన చోరీలు పెరిగిపోతున్నాయి. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన, ఇంటి వద్ద నిలుపుతున్న వాటిపై దొంగలు కన్నేసి కొట్టేస్తున్నారు. బాధితులు సమీప పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇవన్నీ ఎఫ్.ఐ.ఆర్.లు అయితే కేసులు ఎక్కువ పెండింగ్‌లో ఉన్నట్లు కనపడతాయని పోలీసులు... కొన్నిసార్లు వాహనాలు దొరికిన తరువాతే నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ఇవీ ఇక్కట్లు..**

కేసులు నమోదు చేయకపోవడంతో బీమా సంస్థల నుంచి పరిహారం పొందేందుకు, ఆర్థిక సంస్థల రుణ వాయిదాల్లో మినహాయింపు పొందే అవకాశం కోల్పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ వాహనాన్ని దొంగిలించిన వ్యక్తులు దానిని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తే తాము చిక్కుల్లో పడతామన్న భయం బాధితులను వెంటాడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఫిర్యాదు ఇచ్చిన వెంటనే కేసులు నమోదు చేయాలని వారు కోరుతున్నారు.

**గతేడాది కంటే 60 శాతం ఎక్కువ..**

జిల్లా కేంద్రమైన కాకినాడలో నెలకు సుమారు 20 వరకు, ఇతర ప్రాంతాల్లో అంతకు రెట్టింపు సంఖ్యలో వాహనాలు చోరీకి గురవుతున్నట్లు ప్రాథమిక సమాచారం. రాత్రి పూట ఇంటి ఎదుట నిలిపితే తెల్లారేసరికి వాహనం కనిపించడం లేదు. తుని, పెద్దాపురం, పిఠాపురం తదితర ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఈ ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. 2024తో పోలిస్తే 2025లో 59.47 శాతం ఎక్కువ చోరీలు జరగడం గమనార్హం. ఇవి నమోదు అయినవి మాత్రమే. ఎఫ్.ఐ.ఆర్. కానివి, పోలీసుల దృష్టికి రానివి రెట్టింపు ఉంటాయని అంచనా.

**జిల్లాలో కేసులు ఇలా..**

ఏడాది - చోరీకి గురైన వాహనాలు
2024 - 301
2025 - 480

## మూడు మాసాలైనా అందని నగదు

**రాజమహేంద్రవరం:** ఖరీఫ్ రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి విపత్తులకు అతలాకుతలం అయిన కర్షకులు నేటికీ కోలుకోలేక పోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో భారీ ఈదురుగాలులు, వర్షాలు కురవడం, వరదల్లో పంట నీట మునగడంతో ధాన్యం పాడైపోయి తీవ్రంగా నష్టపోయారు. నీట మునగగా.. మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించారు. ధాన్యం కొనుగోళ్లలోనూ ఆంక్షలు పెట్టిన ప్రభుత్వం బిల్లులు సైతం ఆలస్యంగానే విడుదల చేసింది. తాజాగా మరో అవస్థ తప్పడం లేదు. ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం రవాణా, హమాలీ చార్జీలు, సంచుల బిల్లులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. సేకరణ ముగిసి మూడు మాసాలు దాటుతున్నా.. నేటికీ డబ్బు విడుదల చేయకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం రబీ సాగు కీలక దశలో ఉంది. మంచి దిగుబడులు సాధించాలంటే పురుగుమందులు, ఎరువులకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. కానీ చేతిలో సొమ్ము లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తాము ఖర్చు చేసిన రవాణా, హమాలీ చార్జీలైనా అందితే ఆర్థిక ఇబ్బందులు తీరుతాయని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఇప్పట్లో విడుదలయ్యే సూచనలు కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్‌లో వరుస తుపాన్లు, వరదల నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. జిల్లాలో వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వాతావరణ పరిస్థితులను అధిగమించి మార్కెట్‌కు తరలించిన పంటకు రవాణా, హమాలీ చార్జీలు చెల్లించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో ఇలా...**

ధాన్యం కొనుగోళ్లలో చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరవైంది. కోతలు ప్రారంభించిన వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించకుండా ఆలస్యం చేయడంతో రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకుని నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 79,966 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకుగాను 212 ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈఉపంట నమోదు చేసుకున్న రైతుల నుంచి కొనుగోలు చేస్తామని ప్రకటించారు. గ్రేడ్‌ఉఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369గా ధర నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించారు. ధాన్యం కేంద్రాల వారీగా టార్గెట్ పూర్తయిందంటూ చేతులెత్తేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చి ఇక్కడ కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించేశారు. వెరసి జిల్లాలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువ ధరకు బహిరంగ విపణిలో విక్రయించుకోవాల్సి వచ్చింది.

**రూ.13 కోట్లకు పైగా పెండింగ్**

జిల్లా వ్యాప్తంగా గత ఖరీఫ్ సీజన్‌లో వరి రైతులకు చెల్లించాల్సిన రవాణా, హమాలీ చార్జీలకు ఇప్పటికీ దిక్కు లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మూడు నెలల కావస్తున్నా నగదు కోసం నిరీక్షణ తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.13 కోట్లకు పైగా అందాల్సి ఉంది. హమాలీ చార్జీలు రూ.6.50 కోట్లు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రూ.6 కోట్లు, సంచులకు రూ.1.35 కోట్లు విడుదల కావాల్సి ఉంది. క్వింటా ధాన్యానికి హమాలీ చార్జీగా రూ.24, రవాణా చార్జీల నిమిత్తం టన్నుకు రూ.324 చెల్లించాల్సి ఉంది. కానీ వాస్తవంగా ప్రభుత్వం చెల్లించే చార్జీల కన్నా రెట్టింపు స్థాయిలో రైతులకు ఖర్చవుతుంది. వాస్తవ ఖర్చులను పరిగణలోకి తీసుకుని రావాణా, హమాలీ చార్జీలను పెంచాలని రైతులు కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఒక క్వింటా ధాన్యాన్ని కూలీలతో పట్టుబట్టించి మిల్లుకు పంపేందుకు రూ.100 వరకు ఖర్చవుతుంటే.. రైతుకు అందుతున్నది రూ.56 మాత్రమే. పెరిగిన ఖర్చుల దృష్ట్యా వీటిని పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రబీ వరి పంట కీలక దశలో ఉండటంతో ఈ సమయంలో ఆ బకాయిలు అందితే పెట్టుబడికి కొంతమేర ఉపయోగంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. చెల్లింపుల్లో జాప్యంతో రబీ కోసం అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి**

రైతులకు అందాల్సిన రవాణా, హమాలీ చార్జీలు చెల్లిస్తే రబీసాగుకు పెట్టుబడి సాయంగా ఉంటుంది. మూడు నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. వాస్తవ ఖర్చులు పరిగణనలోకి తీసుకుని చార్జీలను పెంచాలి.

**- పరిమి సోమరాజు,**

## నిలిచిన ఎగుమతులు, రద్దవుతున్న ఆర్డర్లు



**అమలాపురం:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ఏపీలో రొయ్య రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అమెరికా టారిఫ్‌ల పెంపు నుంచి ఉపశమనం లభించిందనుకున్న సమయంలో ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో మరోసారి ఎగుమతులకు గడ్డు పరిస్థితులు వచ్చాయి. ఇప్పటికే రాష్ట్రం నుంచి సముద్రమార్గంలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన కంటైనర్లు వెనక్కి రావడంతో ఎగుమతిదారులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఆయా దేశాల నుంచి ఆర్డర్లు రద్దవుతుండడంతో ఇప్పట్లో పుంజుకునే అవకాశం కనిపించడం లేదని సంబంధిత వర్గాలంటున్నాయి. మరోవైపు వారం రోజుల వ్యవధిలో 100 కౌంట్ రొయ్యపై టన్నుకు రూ.30 వేల వరకు ధరలు తగ్గిపోయాయి. చేతికి వచ్చిన పంట అమ్ముకోలేక, దాచుకోలేక రైతులు సతమతమవుతున్నారు.

**పర్యాటక కేంద్రాలే ఆధారం..**

మన రాష్ట్రం నుంచి ఏటా సుమారు 4.25 లక్షల టన్నుల రొయ్య విదేశాలకు ఎగుమతి అవుతుంటుంది. అందులో 40-45 శాతం అమెరికా.. మిగతావి చైనా, యూరప్ దేశాలకు వెళ్తాయి. వచ్చే రెండు మూడు నెలల ఆర్డర్లకు అనుగుణంగా రొయ్య ఎగుమతి కంపెనీలు రైతులతో ఒప్పందాలు సైతం చేసుకున్నాయి. ఇంతలో యుద్ధం ఉరిమింది. వచ్చే సీజన్ వరకు తేరుకునే పరిస్థితి కానరావడం లేదని ఎగుమతిదారుల సంఘం ప్రతినిధి ఒకరు చెప్పారు. గతేడాది అమెరికా టారిఫ్‌లు పెంచిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా గల్ఫ్, ఇతర దేశాల పర్యాటక ప్రాంతాలకు ఎగుమతులు పెరిగాయి. విశాఖ, చెన్నై పోర్టుల నుంచి కంటైనర్లలో సముద్ర మార్గాన రవాణా చేస్తున్నారు.

యుద్ధంతో దుబాయ్, ఇతర అరబ్ దేశాల్లోని పర్యాటక ప్రదేశాల్లో నష్టం జరిగింది. ఆయా ప్రాంతాలకు తిరిగి సందర్శకుల సంఖ్య పెరిగితేనే మన రొయ్యకూ డిమాండ్ ఉంటుంది.

**వాతావరణ మార్పులతో..**

డిసెంబర్ నుంచి జనవరి వరకు వాతావరణ మార్పులతో రొయ్యలో తెల్లమచ్చల వైరస్ వల్ల 50 శాతం పంట రైతులు నష్టపోయారు. మిగతాది అమ్ముకునే సమయంలో యుద్ధం వల్ల ఎగుమతులు లేక ధరలు పడిపోయాయి. ప్రస్తుత పంటను ఎంతోకొంత ధరకు అమ్మి, పరిస్థితులు కుదుటపడే వరకు సాగు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు సూర్యనారాయణ అనే ఆక్వా రైతు తెలిపారు.

## రూ.650 కోట్లతో రహదారుల అభివృద్ధి

**కడియం:** రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10,218 కి.మీ రహదారుల అభివృద్ధికి సర్కారు శ్రీకారం చుట్టిందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) ఎండీ, స్టేట్ హైవేస్ చీఫ్ ఇంజినీరు ఎల్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా గోదావరి జిల్లాలకు రూ.650 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రహదారుల పరిశీలన నిమిత్తం మంగళవారం ఆయన కడియం వచ్చారు. 'న్యూస్‌టుడే'తో పలు విషయాలు వెల్లడించారు.



**నేల స్వభావం ఇదీ**

గోదావరి జిల్లాలో ఎక్కువ భూమి గుల్లగా ఉంటుంది. అది దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట్ల సీసీ రహదారుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

తారురోడ్లపై ఎక్కువగా నీరు ప్రవహిస్తుండటంతో అవి ఎక్కువగా దెబ్బతింటున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నాం.

ఉభయ గోదావరి జిల్లాలో రహదారుల నిర్మాణానికి యంత్రాంగాన్ని సిద్ధం చేశాం. అధికారుల నివేదికలు ఆధారంగా మంగళ, బుధవారాల్లో పర్యటిస్తున్నాం. తుది నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తాం.

**నర్సరీల మీదుగా ఓఆర్ఆర్..**

కడియం అనగానే మొక్కల రవాణాకు పెట్టింది పేరు. భారీ వాహనాల లోడు తట్టుకునేలా రోడ్లు నిర్మిస్తాం. కడియం నుంచి వెదురుమూడి రహదారిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదు. నర్సరీల మీదుగా ఓఆర్ఆర్ నిర్మించే ప్రణాళిక ఉంది.

## అరటి ధర పతనం



తాళ్లపూడి: రంజాన్ మాసం.. అరటి ధర పైపైకి వెళ్లాల్సిన సమయం. రోజురోజుకు పతనమవుతుండడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పండించిన పంట అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. యుద్ధ ప్రభావం

13,195 ఎకరాలు: పచ్చ, కూర, కర్పూర, చక్కరకేళి 1100 ఎకరాలు: పచ్చఅరటి(టిష్యూకల్చర్) విస్తీర్ణం.

**దిగుబడి బాగా ఉన్నా...**

పచ్చ అరటి రకం పెరవలి, తాళ్లపూడి, కొవ్వూరు, కడియం, నల్లజర్ల తదితర ప్రాంతాల్లో ఉంది. టిష్యూకల్చర్ మొక్కలను నాటడంతో గెల సుమారు 20 నుంచి 25 కిలోల బరువు ఉంటుంది. ఎకరానికి 20 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తోంది. కాయలపై మచ్చలు రాకుండా ఉండేందుకు ముందుగానే మొక్కకు ఉన్న గెలకు పాలిథిన్ కవరు అమరుస్తారు. ః పక్వానికి చేరిన తర్వాత వాటిని కిందకు దించి హస్తాలుగా విభజిస్తారు. వీటిని ట్రేలలో నింపి లారీలోకి ఎగుమతి చేస్తారు. కిందటేడాది ఈ సమయంలో కిలో రూ. 24 ఉన్న అరటికి పది రోజుల కిందట రూ.18 ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభం కావడంతో ధర రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం కిలో రూ.11కి చేరింది. 'మూడు ఎకరాల్లో అరటి సాగు చేశా. కిందటేడాది కిలో రూ.20లకు విక్రయించా. వారం పదిరోజుల కిందట కిలో రూ.18 ఉన్న అరటి ప్రస్తుతం రూ.11కు కొనుగోలు చేస్తున్నారు.' అని కౌలు రైతు శ్రీనివాసు వాపోయారు.

## వివాహిత ఆత్మాహత్యాయత్నం

యానాం: యానాం ఉ ఎదుర్లంక బాలయోగి వారధిపై నుంచి గోదావరిలో దూకి ఓ వివాహిత ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా, స్థానికులు రక్షించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం ద్రాక్షారామకు చెందిన పెట్టా సత్యలక్ష్మి స్థానిక బాలయోగి వారధి వద్దకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆమె అందరూ చూస్తుండగానే గోదావరిలో దూకింది. వెంటనే స్థానికులు గమనించి గోదావరిలో వేటాడుతున్న మత్స్యకారులకు తెలపగా, వారు నావలపై వెళ్లి ఆమెను రక్షించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం యానాం జీజీహెచ్‌కు తరలించగా, అక్కడి నుంచి ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఎస్సై పునీత్‌రాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కువైట్‌లో చిక్కుకున్నా..

**పిఠాపురం:** యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ప్రతి క్షణం భయం భయంగా ఉందని, తన తోటివారు ఇళ్లకు వెళ్లిపోయారని, తనను కాపాడండంటూ పిఠాపురం పట్టణానికి చెందిన దాకే కుమారి సోషల్ మీడియా ద్వారా వేడుకుంది. పిఠాపురం రథాలపేటకు చెందిన కుమారి కొన్నేళ్ల కిందట జీవనోపాధి నిమిత్తం కువైట్ వెళ్లింది. అయితే ఇటీవల అక్కడ యుద్ధ వాతావరణం నెలకొనడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియడం లేదని తనను రక్షించాలని ఆమె వేడుకుంటోంది. తన భార్యను ఎలాగైనా స్వస్థలానికి తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆమె భర్త దాసు వేడుకుంటున్నాడు.

## బాలికలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు: ఎమ్మెల్యే



**తాళ్లపూడి:** గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా బాలికలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆహార అలవాట్లు, ఆచరించే పద్ధతుల కారణంగా ఇటీవల క్యాన్సర్ కేసులు ఎక్కువయ్యాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా పెరిగిపోయిందన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ రాకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా అందించే ఈ వ్యాక్సిన్‌ను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కనకాయలంక వద్ద రూ.24 కోట్లతో నిర్మాణం



పి.గన్నవరం: ఏటా గోదావరి సాధారణ వరదలకు లోతట్టు కాజ్‌వే ముంపు బారినపడి పశ్చిమగోదావరి జిల్లా కనకాయలంక గ్రామస్థుల వెతలు వర్ణనాతీతం. ఈ గ్రామం పి.గన్నవరం మండలం చాకలిపాలెం సమీపంలో ఉంది. ప్రజలు ప్రతిపనికి చాకలిపాలెం వైపు రాకపోకలు సాగిస్తుంటారు. పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండల పరిధిలోని కనకాయలంక వద్ద గోదావరి నదీపాయపై వంతెన నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.24కోట్లు మంజూరు చేయించారు. దీనికి మూడు నెలల క్రితం టెండరు ఖరారు కాగా ఇటీవల ఒప్పంద ప్రక్రియ కూడా పూర్తయ్యింది. రెండు వర్కింగ్ సీజన్లలో నిర్మాణం పూర్తిచేసే యోచనలో ఉన్నారు.

పి.గన్నవరం మండలం చాకలిపాలెం వశిష్ఠ ఎడమ ఏటిగట్టు నుంచి కనకాయలంక గ్రామంలోకి 310 మీటర్ల పొడవున 4.25 మీటర్ల వెడల్పుతో, 15 పియర్లు, రెండు అబెట్‌మెంట్‌లు వెరసి 17 పునాదులపై వంతెన నిర్మిస్తారు. 16 కానాలు వస్తాయి. చాకలిపాలెం వైపు 20 మీటర్లు, కనకాయలంక వైపు 30 మీటర్ల పొడవున అప్రోచ్‌లు వస్తాయి. వెల్‌ఫౌండేషన్ విధానంలో నిర్మించేందుకు డిజైన్ చేశారు. గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణం చేపడతారు. ఈ వంతెనతో పి.గన్నవరం మండలాన్ని చేర్చి ఉన్న చాకలిపాలెం, నాగుల్లంక తదితర గ్రామాల ప్రజలకూ ఎంతో ఉపయోగం. ప్రధానంగా ఈ గ్రామాల రైతులు కనకాయలంక వైపున లంకభూముల్లో సాగు చేస్తుంటారు. వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తీసుకొచ్చేందుకు వంతెన ఉపయోగపడుతుంది.





## ఫైట్ మాస్టర్‌తో గోపీచంద్ క్రేజీ ప్రాజెక్ట్!



టాలీవుడ్ స్టార్ హీరోల్లో రేసులో వెనకబడి ఉన్న స్టార్ గోపీచంద్. మ్యాచో మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న ఈ హీరో గత కొంత కాలంగా భారీ కమర్షియల్ బ్లాక్ బస్టర్ కోసం ఎదురు చూస్తున్నారు. హీరోగా కెరీర్ ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కమర్షియల్ స్టార్‌ల జాబితాలో చేరలేకపోతున్నారు. టీ.కృష్ణ వారసుడిగా అరంగేట్రం చేసినా మొదట్లో చూపించిన స్థాయిలో వేగం చూపించలేకపోతున్నారు. సక్సెస్‌లు కూడా అదే స్థాయిలో ఆయనతో దోబూచులాడుతున్నాయి. తన తరువాతే కెరీర్ స్టార్ట్ చేసిన హీరోలంతా రేసులో ఓవర్ టేక్ చేసేసి ముందుకు దూసుకుపోతున్నా గోపీచంద్‌కు మాత్రం కాలం కలిసి రావడం లేదు. దీంతో ఇప్పటి వరకు స్టార్స్ జాబితాలో చేరే కమర్షియల్ బ్లాక్ బస్టర్‌ని దక్కించుకునే పనిలో ఉన్నారు. -ఘాజీ- ఫేమ్ సంకల్ప్ రెడ్డితో ప్రస్తుతం ఓ భారీ సినిమాకు శ్రీకారం చుట్టారు. ఇది గోపీచంద్ నటిస్తున్న 33వ సినిమా. దీన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. సంకల్ప్ రెడ్డి -ఘాజీ- తరువాత మళ్లీ ఆ స్థాయి సక్సెస్‌ని సొంతం చేసుకోలేకపోయారు.తన తరువాతే కెరీర్ స్టార్ట్ చేసిన హీరోలంతా రేసులో ఓవర్ టేక్ చేసేసి ముందుకు దూసుకుపోతున్నా గోపీచంద్‌కు మాత్రం కాలం కలిసి రావడం లేదు. దీంతో ఇప్పటి వరకు స్టార్స్ జాబితాలో చేరే కమర్షియల్ బ్లాక్ బస్టర్‌ని దక్కించుకునే పనిలో ఉన్నారు. -ఘాజీ- ఫేమ్ సంకల్ప్ రెడ్డితో ప్రస్తుతం ఓ భారీ సినిమాకు శ్రీకారం చుట్టారు. ఇది గోపీచంద్ నటిస్తున్న 33వ సినిమా. దీన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. సంకల్ప్ రెడ్డి -ఘాజీ- తరువాత మళ్లీ ఆ స్థాయి సక్సెస్‌ని సొంతం చేసుకోలేకపోయారు.

ఇదిలా ఉంటే ఈ మూవీతో పాటు గోపీచంద్ మరో భారీ యాక్షన్ డ్రామాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. ఈ మూవీ ద్వారా క్రేజీ ఫైట్ మాస్టర్ వెంకట్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. గోపీచంద్‌ని దృష్టిలో పెట్టుకునే సరికొత్త నేపథ్యంలో ఆయన కథని రాసుకున్నారట. ఇటీవలే ఆయనకు వినిపించడం, ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడం జరిగిందని తెలిసింది. ఈ భారీ యాక్షన్ డ్రామాని -యాత్ర- మూవీని నిర్మించిన 70 ఎం.ఎం బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొదలు పెట్టిన టీమ్ ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ని జూన్ నుంచి ప్రారంభించాలని ప్లాన్ చేస్తోందట. ఇందులో గోపీచంద్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎవరు? కీలక పాత్రల్లో ఎవరెవరు నటిస్తారు? వంటి వివరాలతో పాటు సాంకేతిక నిపుణుల వివరాల్ని టీమ్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.

## రజనీ కోసం నెల్సన్ మాస్టర్ ప్లాన్..



సౌత్ సినీ ప్రపంచంలో భారీ అంచనాలు నెలకొల్పిన సినిమాల్లో ఒకటిగా నిలుస్తున్నజైలర్2 ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై మొదటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది. 2023లో రిలీజైన జైలర్ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో దాని సీక్వెల్‌పై అభిమానుల్లో అంచనాలు మరింతగా పెరిగాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరింత పెంచేలా తాజా అప్డేట్లు సినీ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి.

ఈ సీక్వెల్ సినిమాను డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ముందు సినిమా కంటే భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదటి భాగంలోనే అనేక సర్ప్రైజ్ ఎలిమెంట్స్, పలు క్యామియోలతో ప్రేక్షకులను అలరించిన నెల్సన్, ఈసారి కూడా అదే ఫార్ములాను మరింత భారీ స్థాయిలో ఉపయోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా కథలో కీలకమైన మలుపుల కోసం స్టార్ యాక్టర్ల కామియో పాత్రలను ఉపయోగించడం ద్వారా సినిమాకు ప్రత్యేకమైన ఆకర్షణ తీసుకురావాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.


ఈ సీక్వెల్ సినిమాను డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ముందు సినిమా కంటే భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదటి భాగంలోనే అనేక సర్ప్రైజ్ ఎలిమెంట్స్, పలు క్యామియోలతో ప్రేక్షకులను అలరించిన నెల్సన్, ఈసారి కూడా అదే ఫార్ములాను మరింత భారీ స్థాయిలో ఉపయోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా కథలో కీలకమైన మలుపుల కోసం స్టార్ యాక్టర్ల కామియో పాత్రలను ఉపయోగించడం ద్వారా సినిమాకు ప్రత్యేకమైన ఆకర్షణ తీసుకురావాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

అందులో భాగంగానే ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ కూడా ఒక కీలక కామియో పాత్రలో కనిపించనున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని రోజులుగా షారుఖ్ ఈ సినిమాలో కనిపిస్తారనే ప్రచారం కొనసాగుతున్నప్పటికీ, తాజాగా ఆయన పాత్రపై మరింత స్పష్టత వస్తోందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం షారుఖ్ ఖాన్ ఈ సినిమాలో ఒక పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అంతేకాకుండా ఆయనకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలు ఎస్.జె సూర్యతో కలిసి ఉండనున్నాయని కూడా ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుతం భారీ సినిమాల్లో స్టార్ కామియోలు ఒక ట్రెండ్‌గా మారుతున్న సంగతి తెలిసిందే. కథకు కీలకమైన మలుపుల్లో పెద్ద స్టార్‌లను చూపించడం ద్వారా ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేయడంతో పాటూ, స్టార్ హీరోలు భాగమైనప్పుడు సినిమాపై హైప్ కూడా విపరీతంగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలోనే డైరెక్టర్లు ఎక్కువగా ఈ ఫార్ములాని ఫాలో అవుతున్నారు. ఇదే ట్రెండ్‌ను నెల్సన్ దిలీప్ కుమార్ కూడా తనదైన స్టైల్‌లో ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పెద్ద స్టార్‌లను తమ సినిమాల్లో భాగం చేసి, వారిని ఎలివేట్ చేసే క్యారెక్టర్లలో చూపించడం ద్వారా థియేటర్లలో ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వచ్చే అవకాశముంటుంది.

రజనీ- షారుఖ్ సీన్స్ పై ఫ్యాన్స్ ఎగ్జైట్‌మెంట్ ఆల్రెడీ జైలర్2 విషయంలో ఆడియన్స్ చాలా ఆసక్తిగా ఉండగా, మరో వైపు రజినీకాంత్, షారుఖ్ ఖాన్ లాంటి ఇద్దరు సూపర్ స్టార్‌లు ఒకే సినిమాలో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. సోషల్ మీడియాలో కూడా ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. నార్త్ మరియు సౌత్ ఇండియన్ సినీ ప్రేక్షకులను ఒకేసారి ఆకర్షించేలా ఈ కాంబినేషన్ ఉండబోతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. మొత్తానికి భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న జైలర్2లో సర్ప్రైజ్ కామియోలు, స్టార్ కాంబినేషన్లు, డైరెక్టర్ నెల్సన్ స్పెషల్ ప్లానింగ్.. అన్నీ కలిసి సినిమాపై ఉన్న క్రేజ్ ను మరింత పెంచుతున్నాయి. సినిమా రిలీజయ్యాక టాక్ కూడా బాగా వస్తే, ఈ సీక్వెల్ కూడా మొదటి భాగం తరహాలోనే బాక్సాఫీస్ వద్ద పెద్ద సంచలనం సృష్టించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## ఊరించి ఉసూరుమనిపించిన సూపర్ స్టార్స్



సాధారణంగా ఇద్దరు హీరోలు కలిసి నటిస్తున్నారు అంటే అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉంటాయి. ఒక స్టార్ హీరో, ఒక మీడియం రేంజ్ హీరో కలిసి నటించినా కూడా ఆ సినిమాకు మంచి బజ్ క్రియేట్ కావడం చాలా కామన్ విషయం. అలాంటిది ఇద్దరు సీనియర్ సూపర్ స్టార్స్ ఒకే సినిమాలో ఫుల్ లెంగ్త్ రోల్స్‌లో కనిపిస్తే ఇంకేమైనా ఉందా... ప్రేక్షకులు, ఫ్యాన్స్ మాత్రమే కాకుండా మొత్తం ఇండస్ట్రీ అంతా అటు వైపు చూడకుండా ఉంటుందా.. ఇప్పుడు అంతా కూడా సూపర్ స్టార్ రజనీకాంత్, యూనివర్శల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించబోతున్న సినిమా వైపు చూస్తున్న విషయం తెల్సిందే. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఈ సినిమాను మొదలు పెట్టాలి అనుకున్నారు. కానీ కూలీ ఫలితం కారణంగా ఆయన స్థానంలో నెల్సన్ దిలీప్ వచ్చి చేరిన విషయం తెల్సిందే. ఈ సినిమాపై అంచనాలు పెంచే విధంగా అనౌన్స్మెంట్ వీడియోను ఇప్పటికే విడుదల చేయడం జరిగింది. రజనీకాంత్, కమల్ హాసన్‌ల స్టార్‌డంతో పాటు, వారి స్వాగ్, వారి స్టైల్‌లతో సినిమా మరో రేంజ్‌లో ఉండటం ఖాయం అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. అభిమానులు మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారు ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల సినిమా ప్రకటించినప్పటి నుంచి రకరకాల ఊహాగానాలు సినిమా గురించి వినిపిస్తున్నాయి. ఈ ఏడాదిలో సినిమాను ప్రారంభించి వచ్చే ఏడాది ఆరంభంలోనే సినిమా విడుదల ఉంటుందని కొందరు అనుకుంటున్నారు. కానీ తమిళ సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం నెల్సన్ దిలీప్ ప్రస్తుతం చేస్తున్న జైలర్ 2 సినిమా పూర్తి చేస్తే కానీ ఈ మల్టీస్టారర్ సినిమాపై దృష్టి పెట్టే అవకాశం లేదు. అంటే సినిమా ప్రారంభం కావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. రజనీకాంత్, కమల్ హాసన్ మల్టీస్టారర్... ఈ భారీ మల్టీస్టారర్ సినిమా షూటింగ్ కేవలం ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా ప్లాన్ చేస్తారట. ఇద్దరికి సమానమైన యాక్షన్, ఎమోషనల్, డ్రామా సీన్స్ ను దర్శకుడు రాసుకుంటాడని, ఇద్దరి కాంబో సీన్స్ ఎక్కువగా ఉంటాయనే వార్తలు కూడా వస్తున్నాయి. మొత్తానికి సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ సినిమా అదుగో ఇదుగో అంటూ ఊరించి చివరకు ఇప్పట్లో రాదు అన్నట్లుగా మారి పోయింది. షూటింగ్ ప్రారంభంకు ఇంకా చాలా సమయం ఉంది. అంటే విడుదలకు కనీసం ఏడాది సమయం పడుతుంది. అదే నిజం అయితే 2027 చివరి వరకు సినిమా కోసం వెయిట్ చేయక తప్పదు. ఇప్పటికే సినిమా స్టోరీ లైన్ రెడీగా ఉంది. స్క్రిప్ట్ వర్క్ ఒక వైపు నడుస్తూనే ఉంది. అయినా కూడా ఇద్దరు హీరోలను కన్విన్స్ చేసే

## లక్ష్యసేన్.. లక్ష్య సాధకుడు



ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతన టోర్నీ.. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్. ఈ టోర్నీలో విజేతగా నిలిస్తే ఒలింపిక్స్‌లో పతకం గెలిచినట్లుగా భావిస్తారు. అలాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో.. గత వారం లక్ష్యసేన్ సంచలనాలు సష్టించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ షి యుకి (చైనా)కి షాకిచ్చి ప్రకంపనలు రేపాడు. క్వార్టర్‌ఫైనల్లో ఏడో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)ను చిత్తుచేసి మరో అసాధారణ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఫైనల్లో చైనీస్ తైపీ ఆటగాడు లిన్ చున్ చేతిలో ఓడిన లక్ష్యసేన్.. కెరీర్‌లో రెండోసారి ఆల్ ఇంగ్లాండ్ రన్నరప్‌గా నిలిచాడు. సైనా నెహ్వాల్, సింధు, శ్రీకాంత్ తర్వాత భారత బ్యాడ్మింటన్‌లో స్థిరంగా రాణిస్తోంది లక్ష్యసేన్ మాత్రమే.

24 ఏళ్ల ఈ ఉత్తరాఖండ్ షట్లర్.. తక్కువ సమయంలోనే భవిష్యత్ తారగా ఎదిగాడు. బెంగళూరులో ప్రకాశ్ పదుకోన్, విమల్ కుమార్ లాంటి దిగ్గజాల మార్గనిర్దేశంలో రాటుదేలిన లక్ష్య.. 2017లో ప్రపంచ జూనియర్ నంబర్‌వన్‌గా అవతరించాడు. 2019లో డచ్ ఓపెన్‌తో మొదలైన సీనియర్ స్థాయి ప్రస్థానం ఆ తర్వాత జోరందుకుంది. 2022లో చరిత్రాత్మక థామస్ కప్ విజయంలో కీలకపాత్ర పోషించిన లక్ష్య.. 2022 కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణంతో మెరిశాడు. అదే ఏడాది ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్లో ఫైనల్ చేరినా.. రన్నరప్ ట్రోఫీ దక్కింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకం చేజారింది. సెమీఫైనల్లో విక్టర్ అక్సెల్‌సెన్ చేతిలో ఓడిన అతడు.. కాంస్య పతక పోరులో లీ జియాకు తలొంచాడు. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన లక్ష్యసేన్.. హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. కెరీర్‌లో ఇప్పటిదాకా ప్రపంచ టూర్ సూపర్ సిరీస్‌లలో నాలుగు సార్లు, ఛాలెంజర్ టోర్నీల్లో మూడు సార్లు లక్ష్యసేన్ రన్నరప్ ట్రోఫీలు అందుకున్నాడు.

పారిస్ ఒలింపిక్స్ వైఫల్యం, గాయాలతో ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు కోల్పోయిన లక్ష్యసేన్.. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. తాజాగా ఆల్ ఇంగ్లాండ్‌లో సత్తాచాటిన అతడు.. రెట్టించిన ఉత్సాహంతో ఆసియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లను ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నాడు. కోచ్‌ల సలహాలతో శిక్షణ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ.. రాబోయే సీజన్ మొత్తం ఫిట్‌గా ఉండేలా వ్యూహాలు రచించుకుంటున్నాడు.

"ప్రస్తుతం పురుషుల సింగిల్స్‌లో శారీరక శ్రమ విపరీతంగా పెరిగిపోయింది. అందుకు తగ్గట్లుగా శిక్షణ, కోలుకునే ప్రక్రియలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. నాకిప్పుడు 20 ఏళ్లు కాదు. వయసు పెరుగుతున్నకొద్దీ 21-22 ఏళ్ల మాదిరిగా దేహం వేగంగా కోలుకోదు. అప్పట్లో ఏది తిన్నా బరువు పెరిగేవాడిని కాదు. కాని ఇప్పుడు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. గతంలో భుజం గాయాలు వేధించడంతో అటాకింగ్ షాట్లపై ప్రభావం పడింది. ఇప్పుడు పనిభారాన్ని సరిగ్గా నిర్వహించుకోవడంపై దృష్టిసారిస్తున్నా. మానసిక శిక్షకుడు మోన్ బ్రాక్‌మన్‌తో పనిచేయడం కలిసొస్తోంది. నా మానసిక స్థితిలో ఎంతో మార్పొచ్చింది. 2022లో తొలిసారి ఆల్ ఇంగ్లాండ్ ఫైనల్ చేరినప్పుడు కలలా అనిపించింది. ఈసారి క్వార్టర్స్, సెమీస్ ఆడుతున్నప్పుడే టైటిల్ గెలవగలనన్న నమ్మకం నాలో కలిగింది" అని అంటున్నాడు లక్ష్యసేన్. శారీరకంగా, మానసికంగా అత్యుత్తమ స్థితిలో ఉంటే మాత్రం లక్ష్యసేన్ ఎంతటి ఆటగాడినైనా చిత్తుచేస్తాడనడానికి ఆల్ ఇంగ్లాండ్‌లో తొలి రౌండ్ ఫలితమే నిదర్శనం.

## ప్రపంచకప్ విజేతలకు బీసీసీఐ భారీ నజరానా



టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమ్‌ఇండియా పంట పండింది. సూర్యకుమార్ బృందానికి బీసీసీఐ రూ.131 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. 15 మంది ఆటగాళ్లు, సహాయ సిబ్బంది, ఇతర సహాయ సిబ్బందికి ఈ మొత్తం ఇస్తారు. ఇందులో సింహభాగం ఆటగాళ్లకు దక్కుతుంది. స్థాయిని బట్టి సహాయ సిబ్బందికి ఇచ్చే మొత్తాన్ని నిర్ణయిస్తారు. 2024లో కప్పు గెలిచిన జట్టుకు రూ.125 కోట్లు ఇవ్వగా.. ఇప్పుడు మరో రూ.6 కోట్లు పెంచారు. ఒక్కో ఆటగాడికి రూ.6 కోట్లు ఇచ్చి.. మిగతా రూ.41 కోట్లు సహాయ సిబ్బందికి పంచనున్నట్లు సమాచారం. "చరిత్రాత్మక విజయం సాధించినందుకు ఆటగాళ్లు, సహాయ సిబ్బందికి బీసీసీఐ మరోసారి అభినందనలు తెలుపుతోంది. భవిష్యత్తులోనూ విజయపరంపరను కొనసాగించాలని ఆశిస్తోంది" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఓ ప్రకటనలో చెప్పాడు. ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన టీమ్‌ఇండియా.. టీ20 ప్రపంచకప్‌ను వరుసగా రెండోసారి గెలుచుకున్న తొలి జట్టుగా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కప్పును మూడుసార్లు సొంతం చేసుకున్న తొలి జట్టుగా కూడా భారత్ ఘనత సాధించింది.

## అగ్రస్థానంలోనే స్మృతి




దుబాయ్: మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. జెమీమా రోడ్రిగ్స్ (12వ ర్యాంకు) ఓ స్థానం కోల్పోయింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (2), ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ (3), ఆ జట్టు ఆల్‌రౌండర్ ఆష్లీ గార్డ్‌నర్ (4), ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్‌సీవర్ బ్రంట్ (5) టాప్-5లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి అత్యుత్తమంగా దీప్తి శర్మ ఆరో స్థానంలో నిలిచింది. టాప్-10లో ఉన్న ఏకైక భారత బౌలర్ ఆమెనే. ఆష్లీ గార్డ్‌నర్ నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది. హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్), అనాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా), మరిజేన్ కాప్ (దక్షిణాఫ్రికా), అమేలియా కెర్ (న్యూజిలాండ్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మకు నాలుగో ర్యాంకు దక్కింది. పాకిస్థాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతోంది.

## ఐపీఎల్ షెడ్యూల్ విడుదల అప్పుడే: బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా




ఐపీఎల్ 2026కు సంబంధించి మొదటి 20 రోజుల షెడ్యూల్‌ను బీసీసీఐ మార్చి 12న విడుదల చేయనుంది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా ధ్రువీకరించారు. ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభ తేదీని మార్చినట్లు నిర్వాహకులు అధికారికంగా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో ఈ మెగా టోర్నీని మార్చి 26న ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాజాగా దీన్ని మార్చి 28కి వాయిదా వేసినట్లు ప్రకటించారు. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్లు, ఫ్రాంచైజీలకు కాస్త సమయం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 'మేం ఐపీఎల్ 2026 షెడ్యూలును మార్చి 12న విడుదల చేయనున్నాం. ప్రస్తుతానికి 20 రోజుల షెడ్యూలును మాత్రమే ప్రకటించనున్నాం' అని బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా ఓ వార్తాసంస్థకు మంగళవారం తెలిపారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మిగతా షెడ్యూలును తర్వాత విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్‌లో పాల్గొనబోయే జట్లు ఇప్పటికే తమ ప్రాక్టీస్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

మార్చి 15న బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం

'బీసీసీఐ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 15న దిల్లీలో జరగనుంది. టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్‌లతో పాటు ఇతర ఐసీసీ టోర్నమెంట్ విజేతలు, కోచ్‌లను ఆహ్వానించబోతున్నాం. సీనియర్ పురుషుల జట్టుతో పాటు, 2025లో ట్రోఫీని గెలుచుకున్న సీనియర్ మహిళల జట్టు, అండర్ 19 బాలుర జట్టు, అండర్ 19 బాలికల జట్లు రానున్నాయి. 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ టీమ్‌ను కూడా సన్మానించనున్నాం' అని సైకియా పేర్కొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com